ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక.

సంపుటము ౧౭. { ప్రభవనామసంవత్సరము శ్రావణభాద్రపదమాసములు. } సంచిక 3.

భాషాశాస్త్రము—చరిత్ర.

—♦ కోరాడ రామకృష్ణయ్యగారు ఎం. ఏ. ♦—

ఆధునికయుగము ముఖ్యముగాఁ బ్రకృతిశాస్త్రయుగ మని (Age of Science) చెప్పఁబడుచున్నది. ఎక్కడఁ జూచినను బ్రకృతిపరిశోధనలు జరుగుచున్నవి. అనఁగా, ప్రపంచమున మన కగపడుచున్న వస్తుసముదాయము యొక్క మూలస్వరూప మేదో, ఆదినుండియు దానిచరిత్ర మెట్టిదో తెలిసికొని వానితత్త్వమును గ్రహించుటకు విశేషప్రయత్నము చేయఁబడుచున్నది. ఒకవస్తువుయొక్క తత్త్వమును గ్రహించుటకు దానిపూర్వచరిత్రను దెలిసికొనుట యత్యావశ్యకము గదా. కావుననే యీకాలమునఁ బ్రకృతిశాస్త్రముతో పాటు చరిత్రము- ప్రాచీనచరిత్రము, అనుశబ్దముకూడ దిశల మాఱుమ్రోగుచున్నది. ఐతిహాసికపరిశోధనలుజరుపఁబడుచున్నవి. అనేకవిధములగుచరిత్రలు బయలుదేఱుచున్నవి. దేశచరిత్రలు, యుగచరిత్రలు, రాజ్యాంగచరిత్రలు, సామ్రాజ్యచరిత్రలు, జీవితచరిత్రలు, వాఙ్మయచరిత్రలు, ఇంకను శాస్త్రముల చరిత్రలు మొదలగున వనేకములు బయలుదేఱుచున్నవి. ఆయాచారిత్రకాంశములను బోగుచేయుటకుఁగా ననేకవిధము లగుప్రాచీనవాఙ్మయములు, శాసనములు, నాణెములు, శిల్పములు, నింక నితరము లగులేఖ్యపత్రములు పరిశీలింపఁబడుచున్నవి. వీనివలనఁ దెలియవచ్చిన మానవచరిత్రకు నృవంశశాస్త్రము (Ethnology) పురాణవస్తుశాస్త్రము (Archaeology) లిపిశాస్త్రము (Palaeography) జీవశాస్త్రము (Biology) భూగర్భశాస్త్రము (Geology) మొదలగునవి మఱికొంతసహాయము చేయుచున్నవి. కాని శాస్త్రములవలన,

ప్రాచీనచరిత్ర నిర్మాణమునకుఁ గలిగినసహాయములలో శబ్దశాస్త్రమువలనఁ గలిగినసహాయము మహత్తర మైనదిగా నెన్నఁదగియున్నది. ఈశబ్దశాస్త్రమనునది యిటీవలఁ గొలఁదికాలముక్రిందట నేవృద్ధిలోనికిఁ దేఁబడిన దైనను, మానవకుటుంబముల ప్రాచీనచరిత్రమును దెల్పుటలో నిది యగ్రగణ్య మైనయాధారం బై వెలయుచున్నది. ఏలయనఁగా నిది యితరము లగునాధారము లన్నిటివలనఁ దెలిసికొనఁగలిగినదానికంటె మిక్కిలి పూర్వమును ప్రాచీనము నైనమానవచరిత్రను అనఁగా నిదివఱలో మనకుఁ దెలిసినచరిత్రకాలముకంటెఁ బ్రాచీనతరంబగు కాలమునందలి (Prehistoric times) మానవకుటుంబములచరిత్రను మనకుఁ దెలుపుచున్నది. మఱియు నాయాకాలముల నాయాజనులచే స్వయముగ వ్యవహరింపఁబడిన శబ్దములలో వారిభావములు ముద్రింపఁబడి నిక్షిప్తములై యుండును గావునఁ దక్కినవానికంటె నిది నిస్సందిగ్ధ మగుసాక్షాన్నిదర్శనముగ (Direct evidence) గ్రహింపఁదగియున్నది. ఆకాలమందు వారిస్థితిగతు లెట్టివో, వారిసాంఘికమతస్థితులు, వారివృత్తులు ఆచారవ్యవహారములు భావజ్ఞానసంపత్తి యీమొదలగు సన్నిహితవిషయములఁ గూర్చి మనము తెలిసికొనఁగలము. చరిత్రను బలువురు పలువిధముల నిర్వచించిరి. కొంద ఆయాదేశములయందలి రాజ్యాంగవ్యవహారములు లేదా వానిచరిత్రయే దేశచరిత్ర మనిరి. మఱికొంద అందలిమహాపురుషుల జీవితచరిత్రయే దేశచరిత్ర యనిరి. మఱికొంద అందు బయలుదేఱిన మతసాంఘికరాజకీయాద్యనేకవిధములగునుద్యమముల(Social & political & other movements) చరిత్రయే దేశచరిత్ర యనిరి. ఏ దెట్లైనను, ఒకమానవకుటుంబముయొక్క చరిత్రము మనము తెలిసికొనఁదలఁచినపు డాజనుల కాకాలమునఁ గలవివిధములగుభావములను మతాచారములను జీవనపద్ధతులను గూర్చి తెలిసికొనలేకపోయినచో వారినిగూర్చి యథార్థజ్ఞానము కలవారము కాఁబోము. ఈసంవత్సరమున నిన్నియుద్ధములు జరిగినవి, యీరాజు పాలించుచుండెను. ఇందఱు జనులు చచ్చిరి. అనునీచప్పిడివార్తలె దేశచరిత్రము కా దనువిషయ మిప్పుడందఱు గ్రహించుచున్నవిషయమే. శబ్దశాస్త్ర మనున దీవిధము లగుచారిత్రకాంశములను దెలుపుటకుఁ దోడ్పడకపోయినను, ఆయాకాలములందలి జనులభావములను స్థితిగతులను గూర్చినయథార్థజ్ఞానము కొంత కలుగఁజేయు ననుటలో సందేహము లేదు.

కాని "యీశబ్దములు శబ్దశాస్త్రము ననునది చరిత్రజ్ఞానమున కెట్లు తోడ్పడఁగలదు" అని యడుగవచ్చును. శబ్దశాస్త్ర మనఁగా భాషాశబ్దములను గూర్చినశాస్త్రము- అనఁగా, ప్రపంచమందుఁ గలభాషలన్నియు, నాభాషాపదము లన్నియు, ఇంతయేల యేదైననొకయర్థమును సూచించెడివ్యక్తము లగు పదములన్నియు నీశాస్త్రమునకు విషయములే. "యేనోచ్చారితేన, సాస్నాలాంగూలకకుదవిషాణినాం సంప్రత్యయోభవతి సశబ్దః ప్రతీతిపదార్థకః ధ్వనిశ్శబ్దః" అని భాష్యకారుఁడగు పతంజలి చెప్పియున్నాఁడు. ఇప్పుడు భూభాగమున వ్యవహరింపఁబడుచున్నభాషలు సుమారు 900 లకుఁ దక్కువయుండవనికనుఁగొనఁబడినది. ఈభాషలలోఁ బ్రసిద్ధమైనవానికిఁ బరస్పరము గలసంబంధమును జూపి శబ్దశాస్త్రజ్ఞులీభాషలను గొన్నికుటుంబములుగా నేర్పఱిచి, యీభాషాకుటుంబము లొకకాలమునందు వానిని వ్యవహరించిన మానవకుటుంబములనే సూచించు నని నిర్ధారణచేసిరి. అనఁగా, కొన్నిభాషలకుఁ గలసన్నిహితమైనపరస్పరసంబంధము కనిపెట్టఁబడినచో, నాభాషలన్నియు నొకమాతృభాషనుండి వచ్చియుండవలయు ననియు, కావుననే యాభాషలను మాటలాడువారందఱు నొకకాలమున నామాతృభాషను మాటాడుచు నొకచో నివసించిన ప్రాచీనమానవకుటుంబముయొక్క సంతతివారై యుండవలయు ననియుఁ దెలియుచున్నది. ఒక్కొక్క కాలమున నొకజాతివారు దేశాంతరమునకుఁ బోయి యచ్చటిభాష నవలంబించి వ్యవహరించుట తటస్థించుటంజేసి భాషకును జాతికి నియతసంబంధ ముండునని నిశ్చయముగాఁ జెప్పుట కవకాశము లేదుగాని, సామాన్యముగా భాషాకుటుంబములు మానవకుటుంబములను సూచించు నని చెప్పవచ్చును. ఏదైన సారూప్యము గలయొకపద మొకకుటుంబమునకుఁ జెందినభాషలలో సమానార్థకమై కన్పడినచో నది ప్రాచీనకాలమున నామాతృభాషను మాటలాడినజనులుకూడ నాపదము నాయర్థమున వ్యవహరించియుందు రని తలంపఁదగును.

సం.	గ్రీకు	లాటిన్	జర్మన్
అనితి-అనిలః=వాయువు-	అనెమోస్ (anemos)	అనిమస్ (animus)	——
హంసః-	ఖేన్ (chen)	ఆన్సెర్ (anser)	గాన్స. (gans)
భ్రాతర్-	ఫ్రేటెర్ (Phrater)	ఫ్రేటెర్ (frater)	(గాథిక్) బ్రోథర్ (Brothar)

సం.	గ్రీకు	లాటిన్	జర్మన్
మాతర్-	మెటెర్ (mater)	మాతెర్ (mater)	మూటెర్. (mouter)
పంచ-	పెంటె (pente)	క్వింక్వె (quinque)	(గాథిక్) ఫింఫ్ (finf)
చత్వారః-	టెట్టారెస్-టెస్సారెస్ (Tettares)	క్వాటోర్ Quattuor	గాథిక్, ఫిడ్వోర్ (Fidwor)
త్రయః	త్రెస్ (treis)	త్రెస్	(లిథూ) కెటూరి. (Keturi) (గాథిక్) థ్రైస (threis)
భరామి-	ఫెరో (phero)	ఫెరో (fero)	బెయ్‌రా (baira)

ఇట్లు యత్ కించిత్స్వరభేదము గలవై సమానార్థకము లగు వేలకొలఁది యీపదములు నిక్కిలిదూరస్థలము లగు దేశములలోని జనులచే వ్యవహరింపఁ బడుటంజేసి యవి యొకభాషనుండి మఱియొకభాషలోని కెరవు తెచ్చుకొనఁబడిన వని చెప్పుటకు వీలులేకుండుటచే నొకప్రాచీనభాషాస్రవంతినినుండి కాలక్రమమున వేఱుపడి ప్రత్యేకముగా, పాయలై ప్రవహించిన భాషాప్రవాహములుగా నెన్నఁదగియున్నవి. కావుననె యీభాషల కన్నిటికిని మూలాధారమగుమాతృభాష కల దనియు, నిప్పు డీభాషలను వ్యవహరించుచుండెడి జనసంఘములకు మూలభూతం బగునొకప్రాచీనజనసంఘ మాభాషలో వ్యవహరించుచుండెడివా రనియుఁ జెప్పఁబడుచున్నది.

భాషాపదములలోఁ బ్రతిదానికి నేదోయొకయర్థ ముండక మానదు. భాష యనునది మానవునియాంతరంగికభావముల నితరులకుఁ దెలుపుసాధనములలో ముఖ్యమైనది. ఆంతరంగికభావములను ధ్వనిరూప మగుభాషచేఁ బైకివ్యక్తపఱుపఁగల శక్తి జంతువులలో నొక్కమానవునికే గలదు. కావున నాకాలమునందలి యాతనిభావము లన్నియు నప్పటియాతనిభాషలోఁ బ్రతిఫలించియుండె ననుటకు సందేహములేదు. కావున మానవునికి భాష నుపయోగించుకొనుశక్తి కలిగినప్పటినుండియు నాతఁ డుపయోగించిన శబ్దజాలమును మనము గుర్తింపఁగలిగినచో నప్పటినుండియు నాతనిభావములను-అనఁగా భూభాగమునందలి మానవజీవితముయొక్క చరిత్రను మనము తెలిసికొనఁగలుగుదుము. ఇంతకాలమునుండియు మానవుని లేదా మానవకుటుంబముల ప్రాచీ

నచరిత్రను దెలిసికొనుటకుఁగా ననేకవిధము లగుప్రాచీనవస్తువులు లిపులు శాసనములు కట్టడములు మొదలగునవి పరిశోధింపఁబడినవి. కాని ప్రతిదినము మనము మాటలాడుచుండిన భాషలయొక్క శక్తి యెట్టిదో పరిశీలింపఁబడలేదు. ఇటీవల శబ్దశాస్త్రమనునది వచ్చినపిదప-అనఁగా భాషలపుట్టు, పూర్వోత్తరములు ఉత్పత్తి వికాసములు మొదలగువానికిఁ గలకారణములు గనిపెట్టఁబడినతరువాత, భాషాశాస్త్రమనునది తక్కినశాస్త్రములవలెనే యొకశాస్త్రముగా నంగీకరింపఁబడుటచే దీనిమూలమున భాషలయొక్కయు, భాషాపదములయొక్కయు, పూర్వచరిత్రము నన్వేషించి, యవి యేయేకాలముల నేయేమార్పులను జెందినవో, ఏస్థితిలో బయలుదేఱి యెట్లు ప్రస్తుతస్థితికి వచ్చినవో, వాని మూలరూపములు మూలార్థములు నేవియో కనిపెట్టఁబడినవి. ఒకభాషాపదములయొక్కయు వానియర్థములయొక్కయుఁ జరిత్రనుబట్టి యాభాషాపదములను వాడుకొనినజనులు, ఏయేకాలములయం దెట్టిభావములు కలిగియుండిరో యనువిషయమును మనము తెలిసికొనఁగలుగుచున్నాము. మఱియు నీమార్పులకుఁ గలకారణము లేవో యని విచారించుటచే మన కనేకము లగుచారిత్రకవిషయములుగూడఁ దెల్లంబు గాఁగలవు. ఒకచిన్నయుదాహరణము. ఆంగ్లభాషయందుఁ గొన్ని నార్మన్ ఫ్రెంచిపదములు కనఁబడుచున్నవి. ఇవి 11 వశతాబ్దముపిదప బయలుదేఱిన గ్రంథములలోఁ గనఁబడుచున్నవి. దీనిని బట్టి యింగ్లీషువారి కాకాలమున నార్మనులతో సంబంధము కలిగిన దని తెలియవచ్చుచున్నది. దీనికి నిదర్శనముగా 11 వశతాబ్దమం దింగ్లాండుదేశము నార్మనులచే జయింపఁబడిన దని చరిత్రయె ఋజువుచేయుచున్నది.

ఇట్లే, ఆంధ్రవాఙ్మయమున 14 వ శతాబ్దప్రారంభమునుండియు హిందుస్థానీపదములు గానవచ్చుటకుఁ గలకారణమును చారిత్రకవిషయములు సమర్థించుచునేయున్నవి. కొంతకాలముక్రిందటఁ దెలుఁగుభాషలో 'కుంపిని' మొదలగుపదములు వ్యవహారమున నుండుటకును, ఇప్పుడు లాంతరు, ఆసుపత్రి, రోడ్డు, మొదలగునవి ప్రచారములో నుండుటకును గలకారణములు సర్వవిదితములే. ఇట్లు భాషలవలన సూచింపఁబడెడి మానవులజీవితచరిత్రను గూర్చినవిషయములను జరిత్ర సమర్థింపవచ్చును గాని, భాషయైతే చరిత్రచే సమర్థింపలేని-అనఁగా, చరిత్ర కందని యతిప్రాచీనం బగుకాలమందలి మానవకుటుంబముల స్థితిగతులను గూర్చికూడఁ జెప్పఁగలిగియున్నది. ప్రస్తుత మాన్య

సంఘములయొక్క ప్రాచీనచరిత్రను దెలిసికొనుటకు శబ్దశాస్త్ర మెట్లు తోడ్పడుచున్నది పరిశీలింతము.

ఇప్పు డింగ్లీషు, గ్రీకు, లాటిన్, జర్మన్, రష్యను, అవెస్టాభాష, సంస్కృతము మొదలగు హిందూయూరపుదేశములందు వ్యవహరింపఁబడెడు కొన్ని భాషలకుఁ బరస్పరసంబంధము కలదనియు, నివి యన్నియు నొకమాతృభాష నుండి పుట్టిన వనియు, వీనికి మూలమైన యాభాషను మాటలాడిన యొకప్రాచీనకుటుంబముయొక్క సంతతివారే యిప్పు డీభాషలను వ్యవహరించుచున్నా రయియుందు రనియు శబ్దశాస్త్రజ్ఞు లాయాభాషలకుఁ గలసామ్యమునుబట్టి నిర్ధారణచేయుచున్నారు. ఈజనులప్రాచీనచరిత్రమును గూర్చి తెలుపఁదగినయాధారములు సంస్కృతమున ఋగ్వేదాదులు, గ్రీకున హోమరుగ్రంథములు మొదలగునవి కొన్నియున్నను, అవి క్రీస్తుశకమునకుఁ బూర్వము సుమారు రెండువేలయేండ్లకంటెఁ బ్రాచీనమగు చరితమును దెలుపలేవు. అంతకుపూర్వచరిత్రమును, అనఁగా, ప్రాచీనార్యకుటుంబముయొక్క స్థితిగతులను దెలిసికొనవలెనన్నచో భాషాచరిత్రము,పదచరితముతక్క మఱియేయాధారములును లేవు. యూరపుపశ్చిమభాగమునుండి హిందూదేశమువఱకు వ్యాపించిన యీ యార్యసంతతివారికి మూలకుటుంబమువా రేదేశమున నివసించెడివారో వారియాచారవ్యవహారము లెట్టివో, అనువిషయమును దెలిసికొనుటకుఁ గొన్ని పదములు మనకుఁ దోడ్పడఁగలవు.

సంస్కృతమున, 'మధు' అనుపద మొకటి కలదు. దీనికిఁ దేనె యనియు మధుపానీయ మనియు నర్థము. మధూశ మనఁగాఁ దుమ్మెద. దీనికి అవెస్టాభాషలో 'మదు', బల్ గెరియన్భాషలో 'మెద్యు', లిథూనియన్భాషలో 'మెడ్' ప్రాచీనప్రష్యన్భాషలో మెడ్డో, గ్రీకు 'మెథు' ప్రాచీనజర్మన్ మెతొ, డచ్చి మెడె, ఆంగ్లోసాక్సన్- మెడు, ఇంగ్లీషు- మీడ్ అనురూపములు కలవు. ఈభాషలలో నీపదముల కన్నిటికిని తేనె లేదా తేనెతోఁ జేయఁబడిన యొకవిధ మగుపానీయము. (Fermented liquor made from boney) అని యర్థము. ఇన్నిభాషలలోఁ దేనె యనునర్థ మొక్కపదముచేతనే చెప్పఁబడుటచే వీనికి మూల మగుభాషలో నిట్టిపదమే యుండవలయు ననియు, నాభాషను వ్యవహరించిన ప్రాచీనార్యకుటుంబము తేనెను,మధుపానీయమును త్రావెడివా రనియు, తెనెటీఁగలకు నివాసమై తేనె పుష్కలముగా దొరకెడిదేశ

మున నివసించినవా రనియు మన మూహింపవచ్చును. ఇటీవలఁ గొన్ని దేశములలో, తేనెకు బదులు ద్రాక్షసారాయము మొదలగునవి యుపయోగింపఁబడుచున్నను, లిథూనియను లిప్పటికి నాపదమునే వాడుకొనుచు నీమధువానీయమునే పుచ్చుకొనునాచారము నిన్ని వేలయేండ్లనుండియు నిలుపుకొని యున్నవారు. మనదేశమున దేవతాపూజలలో, పంచామృతము స్నానమునను, పితృకార్యములలో మధుపర్కమునను మాత్రమే ప్రాచీనాచారము నిలిచియున్నట్లున్నది.

తేనె లొలికించు దేశములలో నివసించెడి వీరికి జీవనాధారం అనుప్రశ్నకు వీరు ధరించిన, లేదా వీరికిఁ బెట్టఁబడిన 'అర్యులు" అనునామమె కొంతవఱకు జవాబు చెప్పుచున్నది. 'ఆర్య' శబ్దమునకు భూస్వామి (Land holder) అనునర్థమువచ్చినది. కాని దీనిమూలార్థము వీరిముఖ్యవృత్తినే తెలుపును. ఈ పదము 'కదలఁదీయుట' అనునర్థముగల 'అర్' అనుధాతువునుండి యేర్పడినది. భూమిని కదలునట్లు చేయుట దున్నుటవలననే గనుక 'అర్' అనుదానికి దున్నుట యని యర్థము. ఈధాతువునుండియే అవెస్టాలో 'ఎయిర్య' (Airya) లాటిఁలో 'అరేర్' (arare) అనియు, గ్రీకులో 'అరోఁ' (ar-oun) అనియు, ఐరిషులో 'అర్' అనియు, లిథూనియఁలో 'అర్తి' (ar-ti) అనియు, రషియఁలో ఒరతి (ora-ti) యనియు, గాథిక్‌లో 'అర్ జాన్' (ar-jan) అనియు, ఆంగ్లోసాక్సన్ (er-jan) 'ఎర్.జాఁ' అనియు, ఇంగ్లీషులో 'to ear' అనియు, సమానార్థకపదము లేర్పడినవి. ఇంగ్లీషులో 'to ear' అనఁగా to plouth దున్నుట అనునర్థముకలదు. "To ear the land that has some hope to grow" అని Richard II నాటకములో (IV-2) షేక్స్పియరు ప్రయోగించినాఁడు. దీనినుండియె దున్నుట కుపయోగించు పనిముట్టు—నాఁగలి యనునర్థమున లాటిన్‌లో అరత్రం (ara-trum) గ్రీకులో 'అరోత్రోఁ' (aro-tron) లిథూనియఁలో అర్క్లస్ (arklas) అనుపదములు గలిగినవి. సంస్కృతమున 'అరిత్రం' అనఁగా, చుక్కాను (Rudder). నాఁగలి భూమిని కదల్చి దున్నినట్లె చుక్కాను నీళ్లను ఛేదించి నావను నడుపుట కుపయోగించును గాన నాధారార్థ మిచ్చుటను సరిపోవుచున్నది. గ్రీకు 'ఎరా' (era) జర్మన్ 'ఎరో' అనుపదమునకు భూమి—దున్నినభూమి యనియర్థము. సంస్కృతమందలి 'ఇరా'— ఇలా యనుపదమును

ఇంగ్లీషుః అర్త (earth) అనుపదములు వీనికి సంబంధించినవే. ఇన్నిభాషలయందుగల రూపముల సమానార్థకములై కనఁబడుచుండిన యీపదమునుబట్టి చూడఁగాఁ బ్రాచీనార్యకుటుంబమునకుఁ గలజీవనాధారములలో భూమినిదున్నుట, పండించుట అనఁగా వ్యవసాయమే ముఖ్యమైన దనియు సద్దాని నిప్పుడీవేఱు వేఱుభాషలు మాటలాడుసంఘము లన్నియు విడివడక కలసి యేకకుటుంబముగ నున్నకాలమందె యీ రవలంబించియుండి రనియు నూహింపఁదగియున్నది. కాని పశుపాలకత్వముకూడ మఱియొక జీవనోపాధియై యుండె నని యీభాష లన్నిటిలోను గనఁబడుచున్న 'పశు' శబ్దము సూచించుచున్నది. దీనికి లాటినులో 'పెకస్' (pecus) గాథిక్‌లో 'ఫెయ్‌హు' (faihu) జర్మన్‌లో 'వెహ్' (veih) ఇంగ్లీషులో 'ఫీ' (fee) అనియు రూపములు గలవు. వారు పశువులనే ధనముగా నెంచుకొనుచుండి రనుటకు వేదమున 'గవేషణ గవిష్టి' పదములకుఁ గల ధనముకొఱకు వెదకుట యనునర్థమే నిదర్శన మగుచున్నది. ఆధనము—అనఁగా, పశుధనము సంపాదించుట కొకప్పుడు యుద్ధము చేయవలసియుండెను గావున నీశబ్దములకు 'యుద్ధము' అను నర్థముకూడఁ గలిగినది. 'యోధుఁడు' అనుటకు ఋగ్వేదమున 'గోసుయుధ్' గోవులకొఱకుఁ బోట్లాడువాఁడు—అనుపదము కలదు. దీనివలన గోవులకొఱకు—అవియే వారి ధనము గావున ధననిమిత్తమై వారు యుద్ధములుకూడఁ జేయుచుండిరని తెలియుచున్నది. 'పశు' శబ్దమునకుఁ గల 'ధనము' అనునర్థము లాటిన్‌భాషయందలి 'పెక్యూనియ' (pecunia) అనుపదమునందుఁ గూడ నున్నది. దీనినిబట్టియే యింగ్లీషుభాషలో 'పెక్యూనియరీ' (pecuniary) 'ధనసంబంధమైన' అనునర్థముగల విశేషణవాచకపదము గలిగినది. ఆంధ్రమునఁ బశువులకు 'సొమ్ము' లని వాడుట గంజాము విశాఖపట్టణముజిల్లాలలోఁ గలదు. కృష్ణా గోదావరులలో నున్నట్లు నే నెఱుఁగను. కన్నడమునఁ గూడఁ బశువులకు 'దన' మని యందురు. ఈరెండుపదములును "స్వం" "ధనం" అనుసంస్కృతపదములనుండి వచ్చినవే గావున నార్యులు పశువులను సొమ్ముగాను ధనముగాను నెంచుకొనుచుండినకాలమున దక్షిణదేశస్థులతోఁ గలిగిన సంసర్గముచే, వచ్చిన సాంప్రదాయమా యని సందేహము కలుగక మానదు. ఇంతేగాక వేదకాలమున యజ్ఞములయందు దక్షిణలుగా గోవులనె యిచ్చుచుండెడివారు, ఉపనిషత్తులకాలమందుఁ గూడ బహుమానరూప మగు దక్షిణగా గోవులనె

యిచ్చుచుండిరనుటకు నిదర్శనముగా బృహదారణ్యకోపనిషత్తునందు (III-1-2) జనకుఁ డొకవాగ్వాదమున మాధ్యస్థ్యమును వహించి యచ్చటిబ్రాహ్మణులతో నిట్లు చెప్పినట్లు తెలియుచున్నది. "బ్రాహ్మణా భగవన్తో యోవో బ్రహ్మిష్ఠః సఏతా గా ఉదజతాం" ఓపూజ్యు లగు బ్రాహ్మణులారా! మీలో నెవరు బ్రహ్మిష్ఠులో వా రీగోవులను గ్రహింతురుగాక". మఱియుఁ బ్రాచీనకాలమున వివాహశుల్కముగఁ గూడ నీగోవులనె యిచ్చువాచారమున్నట్లు తెలియుచున్నది. అప్పటిసంప్రదాయము ననుసరించియే యిటీవలికాలమున మనువుమొదలగు ధర్మశాస్త్రకర్తలు అష్టవిధవివాహములలో, పెండ్లికొడుకు వధువుతండ్రికి గోయుగము నర్పించి యామెను వివాహము చేసికొనుపద్ధతిని 'ఆర్షవివాహ' మని చెప్పియున్నారు. ఈ 'వధువు' అనుశబ్దమే ప్రాచీనార్యుల సంఘవ్యవస్థను గూర్చి కొంత చెప్పుచున్నది. అనఁగా వారిలో వివాహము లున్నట్లు స్పష్టము. 'వేధ్' అనుధాతువునుండి 'సం. వధు' అనియు, లిథూనియనులో 'వెదు' (wedu) అనియు, సాక్సన్ భాషలో వెద (veda) అవెస్టాలో ఉపవాదయైత=(వాఁడు వివాహము చేసికొనును) అనియు రూపములు కలవు. ఈపదములకు మూలార్థ మగు 'తీసికొనిపోవుట—వహించుట—అనునర్థము ఐరిష్ భాషలో (fedaim) (ఫీడైమ్)—సం. వహామి=I carry—నేను తీసికొనిపోవుచున్నాను. fedan = a team = బండినిగాని రథమునుగాని వహించుపశువులజంట—అనుపదములలోఁ గన్పడుచున్నది. వేదభాషలో 'వహతు' అనఁగా వివాహము. వివాహశబ్దము కూడ నాయర్థమునె సూచించుచున్నది. ఈవహించుట యనఁగా నామెజీవనభారమును వహించుటగాని లేదా అగ్నిచుట్టు ప్రదక్షిణము చేయుటగాని మొదటియర్థమయి యుండదు. వరుఁడు 'వధువు'ను తల్లిదండ్రులకుఁ దెలియకుండఁ గాని లేక వారితోఁ బోరాడి జయించిగాని యెత్తుకొనిపోవుట యనియే దీనిమొదటియర్థము. ఈసాంప్రదాయము ప్రాచీనధర్మశాస్త్రములలోఁ జెప్పఁబడినరాక్షసవివాహమునఁ గానవచ్చుచునె యున్నది. ఇట్లు గానిచో వరుఁడు వధువునకుఁ గా నామెతల్లిదండ్రులకుఁ గొంతసొమ్మిచ్చి యామెను రథముమీఁదఁ దన యింటికిఁ దీసికొనిపోవునాచారమును బట్టియైన 'వహించుట' కాయర్థము వచ్చియుండును. ఇట్లు సొమ్మిచ్చు నాచారమును బ్రబలియున్న దనుటకు 'వధువునకుఁగా నిచ్చెడిధనము' అనునర్థముగల '(Anglo Saxon)' ఆఁగ్లోసాక్సన్

భాషలోని 'Westuma' జర్మనులోని 'విట్టుమ్' (Wittum) స్లైవోనిక్ భాషలోని 'వెనో' (Veno) సంస్కృతమందలి 'వస్న' యనుపదములే నిదర్శనము లగుచున్నవి. ఇంకొకటి. విగతభర్తృకలు మరల వివాహము చేసికొను నాచార మప్పు డున్నటులు గన్పడదు. సంస్కృతమున విధవా, లాటిన్ భాషలో (vidua) విదువ; గాథిక్‌లో 'విదువో' (widuvo) జర్మన్ 'విట్వే' (witwe) ఇంగ్లీషు 'విడో' (widow) అనుసమానార్థకపదములు కనఁబడుచుండుటచే నాకాలమున స్త్రీపునర్వివాహమున కభ్యంతర మున్నట్లు తోఁచును గాని భార్యను గోల్పోయినపురుషుని సూచించుపదము లేకుండుటచేఁ బురుషులు పునర్వివాహము చేసికొనుట కేయభ్యంతరము లేదేమో యని తలంపఁ దగియున్నది. ఇంగ్లీషులోని 'widower' అనుపదము 'widow' యనుదానినిబట్టి తరువాత నేర్పడినది. దీనికిఁ బ్రాచీనభాషలోఁ బ్రత్యేకపద మేమి యున్న ట్లగపడదు. కావునఁ బురుషులపునర్వివాహమున కప్పు డాటంక మున్నట్లు లేదని తలంపఁదగియున్నది. ఇట్లు ప్రాచీనార్యకుటుంబముయొక్క స్థితిగతులనుగూర్చి సూచించెడి పదము లనేకములు గలవు.

సంస్కృతమున 'దమ',—"ధామ" అనఁగా, ఇల్లు సంస్కృతమున ధామశబ్దమునకున్నంత ప్రాచుర్యము 'దమ'శబ్దమున కున్నట్లు లేదు. వైదికభాష యందుఁ 'దమ'శబ్దమునకు వ్యవహారము "వర్ధమానంస్వేదమె"etc.

సం. దమ–Sk. డొమోస్ (domos)- లాటిన్ డోమస్ (domus) ఈ యిండ్లకు ద్వారములు కలవు. సం. ద్వార్; గ్రీకు-థూసా (thusa) లాటిన్ ఫోరెస్ (fores), గాథిక్-దుఅర్ (duar) జర్మన్-తూర్ (tuir) ఇంగ్లీషుడోర్ (door). దీనినిబట్టి ప్రాచీనార్యులు ద్వారాదులతోఁగూడిన యిండ్లలో నివసించెడివారని తెలియుచున్నది. పురుషుఁడె యాగృహమున కధిపతి-యజమానుడు. (ఈ 'యజమాని' శబ్దమునకర్థ మాంధ్రమున నెట్లుమారినదో గమనింపుఁడు.-)

అతఁడె యాగృహమును రక్షించువాఁడు కావుననే 'పతిశబ్దవాచ్యుఁడు దీనికి గ్రీకులో-పోటెస్ (potes) గాథిక్-ఫాథ్స్ (faths) అనురూపములు కలవు. ఈయర్థమునె చెప్పు దంపతీ-శబ్దమునకు గ్రీకున-డెస్‌పోటేస్ (despotes) అనురూపము కలదు. దీనికిమూలరూపము "డెమ్స్‌పోటస్" అనఁగా దమస్‌పతి=గృహపతి అనియర్థము. ఈ 'దంపతీ'శబ్దమును దమస్+పతి-అని

కాక, జంపతీశబ్దసాదృశ్యముచే గాఁబోలును "జాయాచపతిశ్చ"యని విడఁదీసి "జాయాశబ్దస్య జంభావో దంభావోవా నిపాత్యతే" జాయాశబ్దమునకు జంభావము, దంభావము వచ్చునని నిపతించి-జాయాచపతిశ్చ-జంపతీ, దంపతీ, యని సంస్కృతవైయాకరణులు విగ్రహముచెప్పిరి గాని 'జాయా'శబ్దము 'దం'గామాఱుటకుఁ గారణ మేమియుఁ గనఁబడకుండుటచేఁ బ్రాచీనకాలమున నిది"దమః'-గృహమునకుపతి యని కేవలపుపరముగనే గ్రహింపఁబడినట్లు తెలిసికొనవలసియున్నది. గృహభర్త-పతి-కాఁగా భార్య పత్నియైనది. దీనికి గ్రీకున 'పోట్నియా' (potnia) అనురూపము కలదు. వీరి జీవనాధారమగు నాధారవిషయమును దెలుపుటలో "గవాశిరమ్" "గవ్యం" అనుపదములు తోడ్పడుచున్నవి. వీనికిఁ బాలతోఁ గూర్పఁబడిన, లేదా చేయఁబడిన యాహారమని యర్థము. ఉదీచ్యులకు యైరోపీయులకు గ్రీకుభాషలో 'గెలక్టోట్రోఫౌంటెస్' (galaktotrophountes) అనఁగా పాలే యాహారముగాఁ జేసికొని బ్రతుకువారు (Those who subsist on milk) అని యర్థముగల పదముగలదు. ఈయావులపాల నింటియందలి యాఁడుపిల్లలె పితుకుచుండిరనుటకుఁ మన'దుహితృ'పదమె తార్కాణము,దీనికి గీర్వాణభాషలోవలెనె గ్రీకు, ఇంగ్లీషుభాషలలో 'థుగెటర్' (thugater), డాటర్ (daughter) అను సాజాత్యరూపములు (cognate words,)కలవు. వీని కన్నిటికిని కుమార్తె యనియే యర్థము. ఇవి 'పితుకుట' అనునర్థముకల 'దుహ్' ధాతువునుండి నిష్పన్నములై సాజాత్యముకల వగుటచేఁ బ్రాచీనార్యులు తమయాఁడుపిల్లలను గోసంరక్షణమున నియమించి వారిచేఁ బాలను పితికించుచుండెడివా రనియు, నట్లాకకాలమున నింటిలోఁ బాలుపితుకుటె ముఖ్యకర్తవ్యముగాఁ గలిగిన పిల్లలే తరువాత దుహితృశబ్దవాచ్యులై యుండిరనియు మనకుఁ దెలియవచ్చుచున్నది. ఇప్పుడీభాషలను మాటలాడుచున్నవారికిఁ బూర్వు లగు "నిండోయూరోపియను' కుటుంబమువారిలో నొకకాలమున నిట్టియాచారమున్నటు లీపదచరితమువలననే గాని మఱియేయితరగ్రంథసామగ్రివలనను మనము తెలిసికొనుటకు వీలులేదు. గొఱ్ఱెలచర్మముఁను కట్టుకొనెడివారనియు, బొచ్చును నేతకుపయోగించెడివారనియుఁ గూడ 'లెనోఫారియస్' గొఱ్ఱెలచర్మమును ధరించువారు అనెడిగ్రీకుపదమునుబట్టియు, సం. ఊర్ణా, లాటిన్-వెల్లన్, గాథిక్ వుల్ల (wulla) జర్మన్ 'వొల్లె' (wolle) అనుపదములవలనను గ్రీ-ఉ

ఫైనో (uphaino) జర్మని 'వెబెన్' (weben) సం. 'ఊర్ణ—వాభి' అనుపదములవలనను తెలియుచున్నది. కాలవాచకము లగుపదములలో సంవత్సరమును దెలుపుటకుఁగా మొట్టమొదట 'హేమన్త' 'హిమ' అనుపదములు సేకరింపఁబడినట్లు తెలియనగును. దీనికి గ్రీకుభాషలో 'ఖెయ్‌మోన్' (cheimon) అనియు లాటిన్‌లో 'హీమ్స' (hiems) అనురూపములు కలవు. లాటిన్‌లో Bimus, bimus అనఁగా రెండేండ్లు మూఁడేండ్లువయసు గలయనియర్థము. వేదమునఁగూడ నూఱుసంవత్సరములనుటకు "శతంహిమాః" అనుటకలదు. మఱికొన్నిచోట్ల "శతం నో రాస్వశరదః" (ఋగ్వే. II-27-10) "జీవేమశరదశ్శతం" అని 'శరత్' పదమును సంవత్సరపరముగాఁ జెప్పుటయుఁగలదు. మఱియొకటి "సమాః" అనునది అవెస్టాలో 'హామ్' (ham) ఆర్మీనియన్ అమర్న ఐరిష్—సామ్ (sam) జర్మన్ 'సుమర్', ఇంగ్లీషు- 'సమ్మర్' (Summer) అనురూపములు వేసవి అనునర్థములో గలవు. సమశబ్దమునకుఁ గల 'సగము' అనునర్థమునుబట్టి ప్రాచీనార్యులు సంవత్సరములో సగముభాగము వేసవిగాఁ గలప్రదేశమున నున్నప్పుడీపదము బయలుదేఱి, తరువాత సంవత్సరపర్యాయముగా వాడుకలోనికి వచ్చియుండునని యూహింపఁదగియున్నది. 'హిమ, శరత్, సమ' శబ్దములవలెఁ దక్కినఋతుద్యోతకపదములు సంవత్సరపర్యాయములు కాలేదు. దేవతలనుగూర్చినపదములలో దేవ-Lat. deus లిథూనియన్ (diewas), ద్యౌపితా-Lat. 'juppiter' గ్రీకు zeus pater (జియస్ పెటెర్) అగ్ని-లిథూనియన్ (ugnis) ఉగ్నిస్, రష్యన్ (ఒగోన్) ogon. లాటిన్ (ignis) ఇగ్నిస్, ఉషస్-గ్రీ (eos) ఇయాస్ లాటిన్ (aurora) ఔరోరా-అనుపదములనుబట్టి యీదేవతలీభాషలమాటాడువారందఱుఁగలసియున్నప్పటినుండి యుండిరని తెలియవచ్చుచున్నది. ఇట్లె ద్రావిడభాష లనఁబడు దక్షిణహిందూదేశమందు వ్యవహారములో నున్నభాషలలో సమానార్థకములైన సరూపపదములు లేదా సాజాత్యపదములను గూర్చి విచారించినచో ఏదేశమును గూర్చి తెలిసీతెలియని ప్రాచీనకాలస్థితిగతులు కొన్ని బయలుపడు ననుటకు సందేహము లేదు. ఈభాషలన్నియు నింతకుఁబూర్వము చెప్పఁబడినభాషలలో నుండివచ్చినవా లేక భిన్నకుటుంబమునకుఁ జెందినవాయని నిరూపించుటకు సాధ్యపడని కొన్నిపదము లిందుఁ గనఁబడుచుండుటచే నట్టిపదములను దీసికొని మనము విచారింపవలసియుండును. కాని సంస్కృతమున

ధాతుపాఠము హద్దులేని దగుటచేతను కైఁగా "ధాతూనా మనేకార్థత్వాత్" అను కారణముచే నీపదముకైన మనకు వలసినయర్థము సాధింపవలనుపడు చుండుటచేతను, ఈపదముల యుత్పత్తిక్రమమునుగూర్చి బాగుగఁ బరిశీలించి నఁగాని నిశ్చయింప వీలులేకున్నది. మొత్తముమీఁద దక్షిణదేశభాష లన్నిటిలో సమానార్థకములైన సరూపపదములు తగినహేతువు కనఁబడినఁగాని సంస్కృతజన్యములని చెప్పుటకు సాహసింపఁగూడదు. ఇట్టి సాజాత్యపదములను గొన్నిటిని బరిశీలించినచో, నిచ్చటి ప్రాచీనజనులస్థితిగతులు కొంత తెలియఁగలదు.

ఆంధ్రమున గుడియనునర్థమున 'కోవెల' యనుపద మొకటి వ్యవహరింపఁబడుచున్నది. దీనిసాధురూపము 'కోయిల' 'కోయిల్' అని తమిళరూపము. కో అనఁగా రాజు కొండఱిజనులకు రాజుపాలకుఁడై సర్వప్రపంచమునకంతకును పాలకుఁడైనవాఁడు గనుక దేవుఁడుకూడ 'కో'శబ్దవాచ్యుఁడైనాఁడు. అతనికిఁగాను గట్టఁబడిన యిల్లు స్థానము కోయిల్ అయినది. ఇందా దేవుఁడు వారిచేఁ బూజింపఁబడుచుండెను. కోనేఱు దేవునికొఱకైన ఏఱు—తమి. ఏఱు—నీటిప్రవాహము కోనేటు అయినది. ఈదక్షిణదేశ భాషలన్నిటియందును మరుందు—మందు అనుపదములు కలవు. ఇవి 'పరిమళించు', అను నర్థముగల 'మరు' అనుధాతువునుండి యేర్పడిన 'మరం' అనుపదమునుండి వచ్చినవి. మరం అనఁగాఁ జెట్టు. మొక్కలు, చెట్లు, ఆకులు మొదలగునవే మందులుగాఁ బ్రాచీనకాలమున నుపయోగింపఁబడియుండుటచేతనే, మరందు— మందు— ఏర్పడిన దని తెలియుచున్నది. దీనినిబట్టి దక్షిణదేశమునఁ బ్రాచీనకాలమున మూలికావైద్యము ప్రబలియున్న ట్లూహింపఁదగియున్నది. ఇప్పుడు సీసాలలోని నీళ్ళకుఁ గూడ నీ'మందు' అనుపదమునే యుపయోగించుచున్నాము. త. ఇరుంబు—తె. ఇనుము— త. వెళ్లి— వెండి; చెంబొన్— చెంబు; మొదలగు నీ సజాతీయపదములనుబట్టి ప్రాచీనద్రావిడుల కీలోహములజ్ఞానము కలదనియు, నాయాలోహములను వానికిఁ గలవర్ణములను బట్టి, అనఁగా, ఇరుంబు—ఇరుంబొన్—నల్లనిలోహము, ఈ'ఇరు'శబ్దము 'ఇరులు'చీకట్లు అనుపదములోఁ బ్రసిద్ధము—వెళ్లి—వెళ్—అనఁగాఁ దెల్లనిలోహము, వెండి, చెంబొన్—చెమ్మ+పొన్ను=ఎఱ్ఱనిలోహము—రాగి యని యిట్లు వానికిఁ గలవర్ణమునుబట్టి పేళ్లిడిరనియు నివి'అయస్' మొదలగుపదముల తద్భవరూపములు కావనియుఁ దెలి

యుచున్నది. ప్రాచీనకాలమున నీదక్షిణదేశస్థులు నావికాయానము చే బహు దూరదేశములకేగి యచ్చటివారితో వర్తకవ్యాపారములు సల్పిరనుటకును సముద్రముదాఁటుటకు సాధనములను నిర్మించుకొనిరనుటకును తమి: ఓడం, తె: ఓడ; త: పడగై, తె: పడవ; త:కట్టమరాౝ మొదలగు దేశీయపదముల వలన సుస్పష్టంబగుచున్నది. 'ఓడ' యనుపదము 'ఓడు' to run away, to flee, పరుగెత్తుట యనునర్థముగల ధాతువునుండి యేర్పడినది. నీటిపైఁ బరుగెత్తునది గావున 'ఓడ' యైనది. నీళ్లు ఓడుట యనునప్పు డీధాతువునే ప్రయోగించుచున్నాము. వఱ్ఱోడిన పెల్లో యని నన్నెచోడుఁడు కుమారసంభవమునఁ బ్రయోగించినాఁడు. 'కట్టమరాౝ' అనుపదమునుబట్టి చెట్లస్రానులను త్రాళ్లు మొదలగువానితోఁ గట్టి వానిమూలముగ సముద్రమునుదాఁటుచుండువారని తెలియుచున్నది. కన్నడమున 'కప్పల్' అనఁగా పైనికప్పుగలిగిన చిన్నపడవ. పడవ కట్టికప్పున్నట్లు కనఁబడదు. హీబ్రూభాషలో 'తూకి-యమ్' తోకై, అనియు, గ్రీకులో 'టవోస్' అనియు తమిళమునందలి నెమలి యనునర్థముగల తోగై- అనుపదము కనఁబడుచున్నది. ఇస్లె-అరెబిక భాషలో కాఱియన్ అనునది- తమిళమందలి 'కరప్పు' (కర్పూర) అనుపదము. తమిళమందలి 'అరిశి' పదమె 'ఒరిజా' యనురూపమున గ్రీకుభాషలోఁ గనఁబడుచున్నది. దీనినిబట్టియె ప్రాచీనకాలయిన నీదక్షిణదేశస్థులు లా యూదేశముల కాయావస్తువులను దీసికొనిపోయి వ్యాపారము చేసి రని తెలియవచ్చుచున్నది.

ఇఁకఁ బొక్కిలి, చంక మొదలగుపదముల వ్యుత్పత్త్యర్థమును జూచినచో వారికిఁ గొంతశారీరకశాస్త్రజ్ఞానము కలదని తెలియఁగలదు. పొక్కిలి-పొర్ + కుళి-తమి. కుళి-అనఁగా గొయ్యి. పొర్కుళి=ప్రోచునట్టి-శిశువును పోషించి రక్షించునట్టి గొయ్యి-తల్లినుండి గర్భస్థ మగు శిశువున కీనాభినాళముమూలమునసె పోషణ జరుగుచున్న దని యీపదము సూచించుచున్నది. కావునసె యది పొక్కిలియైనది. చంకశబ్దము-కై + కుళి=చేతియొక్క గొయ్యి-arm pit అని మూలార్థము. హృదయమునకు-గుండెకాయ గుండియయను దేశ్యపదములు కలవు. గుండ్రముగ నొకకాయవలె నుండుటనుబట్టి దీని కీపేరు వచ్చియుండును. మోఁకాలు, మోఁచెయ్యి-తె. ముణంగాలు-ముణంగై-ముట్రంగాల్-ముట్రంగై-ముట్రి- కీలు-'ముడుచు'ధాతువు. చేతిని, కాలిని మధ్యమము డుచుటకు వీలైనప్రదేశములు మోఁచెయ్యి, మోఁకాలు ఇవియన్వర్థములు. త

ఎళుత్తు=అనఁగా వర్ణము, ఇది ఎఱు=to draw-లాగుట యనఁగా నొకదాని తరువాత నొకటిగా వ్రాయఁబడునది. దీనినిబట్టి వర్ణములు వ్రాత చిరకాలమునుండి యున్నట్లు గ్రహింపఁదగినది. ఇట్లే,త. వరై-వ్రాయు-వ్రాత-వ్రాలు-చేవ్రాలు- దీనినిబట్టి వ్రాఁతకూడ చిరకాలము క్రిందటనే యేర్పడియుండును. తమిళమున ఆవి యనఁగా-ఆత్మ Soul అనియర్థము- ఆవి=అనఁగానూపిరియని తెలుఁగునను గలదు-"ఆ సుయోధనుముక్కున నావి గలుగ" ననిభారతము ఊపిరి-ప్రాణమనియర్థము. దీనికి సంబంధించినదె 'ఆవిరి,-దీనిని 'సిరావి, యని తమిళులు చెప్పటకలదు. ఆవిరివలెనె యదృశ్యమయ్యెడిది లేక కనఁబడనిది, గావున 'ఆవి, అనఁగాఁ బ్రాణము అనికొందఱును,ఆత్మయనికొందఱును జెప్పిరి. త.ఉయిర్-ఉసుర్-ఉసురు- అనుపదములకుఁగూడ నిదియె యర్థము. అనఁగాఁ బ్రాణము త.ఉయిర్ ఎళుత్తు=అనఁగా అచ్చులు- లేక ప్రాణులు అని యర్థము. ప్రాచీనకాలమునుండి యిప్పటివఱకును వచ్చుచున్న యొకయాచారమును సూచించెడి 'ఓలె' యనుద్రావిడభాషాపద మొకటి కలదు. ఒలె, ఓలె-యనఁగా తమిళమళయాళకన్నడములయందు- శ్రీతాళము- ఒకవిధముగు తాడిచెట్టనియర్థము. ఆదేశములలో స్త్రీలు ధరించెడు నొకకర్ణాభరణమును గూడ'ఓలె' యనిచెప్పుదురు. ఈయాభరణము శ్రీతాళపత్రముతోఁ జేయఁబడియుండుటచేతనే దీనికి 'ఓలె' యనుపేరు వచ్చినది. మలబారుదేశమున నీతాటియాకుతోఁ జేయఁబడినయీయాభరణమును జెవులకుఁ బెట్టుకొనుట యిప్పటికిని గలదు. ఆంధ్రులు పెట్టుకొను చెవుల 'కమ్మలు'కూడ నిట్టితాళపత్రము చేతనే యొకకాలమునఁ జేయఁబడుచుండెడివేమో ? 'కమ్మ'యనఁగాఁ దాటియాకని యర్థ ముండియుండును. పూర్వ ముత్తరములు తాటియాకులమీఁద వ్రాసికొనునాచారమునుబట్టియె, కాగితముమీఁద వ్రాసినను జాబులు 'కమ్మలు' అయినవి. శ్రీతాళపత్రములతోఁ జేయుబడిన కర్ణాభరణములు ధరించుట చిరకాలమునుండి యాచారమై యుండెననుటకు, కాళిదాసునిచే రచింపఁబడినట్లు చెప్పఁబడుచున్న శ్యామలాదండకమున "తాళీదళాబద్ధ తాటంక భూషావిశేషాన్వితే"యని దేవికి విశేషణముగా వాడిన యీవాక్యమునుండి తెలియవచ్చుచున్నది.

ఇట్టి యీయాభాషలయందలి పదముల మూలార్థములను జరిత్రను బరిశోధించి చూచినచోఁ జిరకాలమునుండి భూభాగమున నివసించిన మానవకుటుంబములఁగూర్చిన చరిత్రాంశ లనేకములు విచిత్రములై కనుపడుచుండును.

పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి—శృంగారశాకుంతలము.

టేకుమళ్ల అచ్యుతరావుగారు ఎం. ఏ. యల్. టి.

(గతసంచిక తరువాయి)

క. ఇట్టల మగుమతి భారత, ఘట్టమునకు నడనయచ్చుఁ గట్టిన కవితా
పట్టాభిషిక్తు నన్నయ, భట్టోపాధ్యాయుఁ దలఁచి పరమప్రీతిన్.

గీ. ఉభయకవిమిత్త్రునత్యంతశుభచరిత్రు, భానుసమతేజుఁ గొమ్మయప్రభుతనూజు
సుకృతివిభ్రాజిఁ దిక్కనసోమయాజి, బ్రణుతబహుదేశకవిరాజిఁ బ్రస్తుతించి.

అని కవిత్రయములో మొదటి యిద్దఱనే ప్రశంసించెను. తరువాత వెన్నయామాత్యునకుఁ గృతిపూర్వకముగా నొక్క ప్రబంధము రచింపు మని నప్పుడయినను

సీ. నన్నపార్యుఁడు ప్రబంధప్రౌఢివాననానంపత్తి సొంపు పుట్టింప నేర్చు
దిక్కనయజ్వ వాక్సూక్తికామోదంబు చెలువు కర్ణముల వాసింపనేర్చు
నాచిరాజునిసోము వాచామహత్త్వంబు సౌరభంబులు వెదచల్లనేర్చు
శ్రీనాథభట్టు భాషానిగుంఫంబుల పరిమళంబులుగూడఁ బలుపనేర్చు

... ...

ఇట్లు ప్రాచీనాంధ్రకవుల స్తుతించుచు నన్నయ తిక్కన, సోమన్న శ్రీనాథులను మాత్రము ప్రశంసించెను గాని యుభయసందర్భములలోను గవిత్రయములో నొకఁడగు శంభుదాసుని మాట నెత్తనైనలేదు. ఇది చాలవింతగా నున్నది. ఎఱ్ఱాప్రెగడను గుఱించి, తనకు గౌరవము లేకపోయెనా లేక కృతిపతికి గౌరవము లేకపోయెనా యని విచారింప, జైమిని భారతములోఁ గృత్యాదిని 'మానన్నయభట్టుఁ దిక్కకవి నెఱ్ఱాప్రెగ్గడన్ సోమునిన్', అని యీ కవి రచించెను. కావున నెఱ్ఱాప్రెగ్గడను గుఱించి కవి కెంతమాత్రము, ననాదరము గాని,యగౌరవము గాని లేదని స్పష్టపడుచున్నది. మఱియేకారణమున నెఱ్ఱాప్రెగడ మహాకవిని బ్రశంస చేయుట లేదనిన,—ఎఱ్ఱాప్రెగ్గడ గుడ్లూరు గ్రామస్థుఁడు అద్దంకి రెడ్డిప్రభువులయొద్ద నాస్థానకవి. గుడ్లూరు కందుకూరు తాలూకాలోనిదియు, సోమరాజుపల్లికిఁ జాల దగ్గఱగా నున్నది. చిల్లర వెన్నయామాత్యుఁడు కరణముగా నుండి రెడ్డిప్రభువుల క్రింద నుద్యోగిగా నుండెను. స్వశాఖీయు లగునియోగులై, సమీపగ్రామములలో నున్నగృహస్థ

కుటుంబములకుఁ జేరియుండిన వారగుటచేతను, ఏకసంస్థానాధిపత్యసేవకు లగుటచేతను ఎఱ్ఱాప్రగడకుటుంబమగు చెదలవాడవారికిని వెన్నయకుటుంబమగు చిల్లరవారికి నన్యోన్యద్వేషములుండియుండవచ్చును. అందుచేతఁ గృతిపతియగు వెన్నయ శత్రుకుటుంబము వాఁడైన శంభుదాసునిగుఱించి యొక్కమాటయైనను వ్రాయనియ్యలేదు.

శాకుంతలమూలకథ :—భారతమునం దాదిపర్వములో శకుంతలాదుష్యంతుల కథ యిట్లున్నది. హస్తినాపురముయొక్క రాజగు దుష్యంతుఁడు వేటకొఱకు మాలినీతీరారణ్యమునకుఁ బోయి యందున్న కణ్వమహర్షియాశ్రమముఁ జొచ్చి యామహనీయుఁడు ఫలాహరణార్థము బైటికి వెళ్లియుండ నాతనికొమార్తె యగుశకుంతల రాజున కర్ఘ్యపాద్యాదు లొసంగి స్వాగత మిచ్చెను. రా జాకన్నియ రూపరేఖాలావణ్యములఁజూచి మోహపరవశుఁడై యామెతో నీవె ట్లూర్ధ్వరేతస్కుఁ డగుకణ్వమహర్షికి జనించితి వని యడుగ నాముగ్ధ తా నొకప్పుడు తండ్రినోట విన్న తనవృత్తాంతమును రాజనందనునకుఁ జెప్పెను. ఈకథ సుప్రసిద్ధ మైనదిగాన సంక్షేపముగా నిట వ్రాసితిని.

నృపపుంగవుఁడాయుదంతమును విని యాకన్య క్షత్రియజాత యని తెలిసి గాంధర్వమునఁ దన్నుఁ బరిగ్రహింప వేఁడికొనెను. అందున కాయువతి తనకుఁ బుట్టినకుమారునకు రాజ్యపట్టాభిషేకముఁ జేయున ట్లొడంబఱచుకొని యియ్యకొనెను. గాంధర్వవివాహానంతరమున రాజు తిరిగి హస్తినాపురికిఁ బోయెను. తదనంతరము కణ్వమహర్షి యాశ్రమమునకు వచ్చి దివ్యజ్ఞానమున నీవిషయ మంతయుఁ గ్రహించి తనకూఁతునకుఁ జక్రవర్తి భర్త యయ్యె నని సంతసించి భీతిల్లిన శకుంతల నూరార్చెను. కొన్నినెలలు గడచినపిదప శకుంతల కొక సుపుత్రుఁడు గలిగెను. వానికి సింహదమనుఁ డనుపే రిడిరి. పిల్లవాని యాఱవ సంవత్సరమున మునిపుంగవుఁడు శకుంతలను, కొడుకును దుష్యంతునికడకు బంపుటకుఁ గొందఱు శిష్యుల సహాయముఁ జేర్చి యామెను హస్తినాపురికిఁ బంపిన వారు నిండుకొలువులో నున్నరాజునొద్దకుఁ దీసికొనిపోయిరి. నృపపుంగవుఁడు భార్యను బుత్రునిఁ జూచి తెలిసియుఁ దెలియనట్లుగ నిన్నకుండెను. అంత శకుంతల క్రోధోద్విగ్నమానసయై తనవిధిదుర్విపాకమునకు వగచుచు సభాస్థలి విడిచి పోవ నుద్యమించుచుండ నశరీరవాణి—

శ్లో॥ భర స్వపుత్త్రం దుష్యంత! మావమంస్థా శ్శకుంతలామ్
త్వం చాస్య ధాతా గర్భస్య సత్య మాహ శకుంతలా.

అని యుద్ఘోషించెను.

ఆమాటలు సభవా రందఱు వినిరి. అప్పుడు రాజు తనప్రజలందఱకు శకుంతలయొక్క పాతివ్రత్యమును దెలుపఁగోరి యిట్లు చేసితి నని చెప్పి పుత్త్రునినాలింగనము చేసికొని భరతునకు యౌవరాజ్యపట్టాభిషేకముఁ జేసెను.

కాళిదాసుని శకుంతలనాటకము :—భారతమందలి యీ యితివృత్తమును శృంగారరసప్రధాన మగునాటకనిర్మాణముఁ గూర్చుకొని నాయికానాయకుల శీలములను జేర్చియు, నూతనపాత్త్రములఁ గల్పించియు, కథాంతములఁ గొన్నిటి మార్చియు నిట్లనేకవిధములఁ బెంచియుఁ, గుదించియు, వ్యక్తీకరించియు సర్వాంగసుందర మగునాటకరాజమును, కాళిదాసమహాకవి రచించెను. కాళిదాసు—

(1) శృంగారరసవర్ణనము కొఱకు నాయకున కొకనర్మసఖుఁ డగు మాండవ్యుని, నాయికకు నిద్దఱుసకియల, ననసూయాప్రియంవదలను, నూతనముగఁ గల్పించెను.

(2) శకుంతలయొక్క జన్మవృత్తాంతము నామెచే స్వయముగాఁ జెప్పింపక, సఖు లగుప్రియంవదానసూయలచేఁ జెప్పించెను. ఏల యనఁగా శృంగారరసావేశద్యోతక మగునీవృత్తాంతము నూతనానురాగకోరకము లుదయింపఁ జేయుచున్న యీకన్యచేఁ జెప్పించుటకంటె, సఖులచేఁ జెప్పించుట యెంతయేని యుచితము; వీరైననుఁ గొంతవఱకుఁ జెప్పి మిగిలినభాగము సిగ్గుచేఁ జెప్పలేకపోయిరి.

(3) విప్రలంభశృంగారముకొఱకు వనగజప్రవేశ మొకటి గల్పించెను.

(4) శకుంతలకుఁ గొడుకు పుట్టినతర్వాత నాఱవయేట దుష్యంతునికడ కామెను దీసికొనిపోయినట్లు మూలకథ యుండఁగా నామెగర్భవతిగా నున్నప్పుడే రాజునొద్దకు వెళ్ళినట్లు కాళిదాసు మార్చెను. దీనికిఁ గారణములు :—

(i) దీర్ఘ మగుకాలాత్యయ మైనయెడల నాయికానాయకులప్రేమరసము తగ్గు ననియు (ii) నాటకమందలి యితివృత్తమున దీర్ఘకాలవిలంబన మనుచితమనియు నుండఁగా నోపును.

(5) శార్ఙ్గరవుఁడు, సోమరాతుఁడు మొదలగు చిన్నపాత్త్రములనుఁ దత్తదవసరము లగుపనులనిమిత్తము క్రొత్తగఁ గల్పించెను.

(6) మూలకథయందు దూర్వాసమహాముని శాపవిషయము లేనే లేదు. నాయకునిశీలము నిలుపుటకుఁ గా నీశాపకారణమును కాళిదాసు నూతనముగఁ గల్పించెను. ఇంక నెన్నియో చిన్నమార్పులును, గూర్పులును చేయఁబడినవి. కాళిదాసుని యప్రతిమానప్రతిభ, రసపోషణమందే గాక తత్తదనుకూల మగుకథాశరీరనిర్మాణమందును గాన్పించుచున్నది.

పినవీరభద్రకవి భారతమునందలి మూలకథను గాని, కాళిదాసుని నాటకమందలి కథనుగాని యథారూపముగాఁ దీసికొనక రెంటిని మిశ్రముఁ జేసి తనప్రబంధమున కనుకూలముగా నుండునటులు వాడికొనెను. కాళిదాసు రచించినది దృశ్యకావ్య మగుప్రబంధము, నాటకముయొక్క ముఖ్యోద్దేశము ప్రదర్శనముచే రసముఁబుట్టించుట. నాటకమందుఁ బ్రదర్శనయోగ్య మగుకథాసంవిధానము స్థలకాలనియమములకు లోఁబడి యున్నది. ప్రబంధమందలికథాసంవిధానమున కట్టి సంకుచితనియమములు లేవు. కాఁబట్టి కాళిదాసు, నాటకనిర్మాణమునకొఱకు నూతనపాత్రములు చిన్నవియుఁ బెద్దవియుఁ గల్పించి కథాప్రణాళికను నిరంతజీవితవాహినీప్రతిబింబితముఁ జేసెను. పినవీరభద్రుఁ డాయీపాత్రములను జాలవఱకు విడిచిపెట్టి రసవర్ణనల కనువగు క్రొత్తయవస్థలను గల్పించికొనెను. ఇట్లుభయకవులు లక్ష్యభేదములఁబట్టి కథాసంవిధానము మార్చుకొని తమవ్యక్తిమహిమలఁ బోషించికొనిరి.

తే. భారతప్రోక్తకథ మూలకారణముగఁ, గాళిదాసునినాటకక్రమము కొంత
తావకోక్తికి నభినవశ్రీ వహింపఁ, గూర్మి కృతిసేయు నాకు శాకుంతలంబు.

అని వెన్నయామాత్యుఁడు చెప్పినరీతి యొప్పిదముగా నిర్వహింపఁబడినది. పినవీరభద్రుని శృంగారశాకుంతలకథకును భారతమందలికథకును, కాళిదాసునినాటకమందలి కథకును గలభేదములు—

(1) భారతమునందు శకుంతల తనజన్మప్రకారమును దానే దుష్యంతునితోఁ జెప్పినటులును, కాళిదాసునినాటకమందు, చెలికత్తెలు దుష్యంతునితోఁ జెప్పినటులు నిదివఱకే వ్రాసితి. ఈవిషయమును పినవీరభద్రకవి పైరెండువిధముల నిరాకరించి తనగ్రంథమున కనుకూలించిన క్రొత్తమార్పుఁ జేసికొనెను. శృంగారరసపూరిత మగునీయితివృత్తమును స్త్రీలచేఁ బురుషునకుఁ జెప్పించిన విపులవర్ణనలకు నవకాశమీయ దని కణ్వమునిశిష్యులచే రాజునకుఁ జెప్పించెను. ఈమార్పింతయు సమంజసమై కవియొక్క యుచితజ్ఞతకు గొప్పదృష్టాంతముగా నున్నది.

(II) కాళిదాసుని గ్రంథమందు వనగజమాశ్రమమునఁ బ్రవేశించినట్లును, దుష్యంతుఁడు దానిని బంధించుటకు వెళ్లినట్లును జెప్పుటచే శకుంతలయొద్దకుఁ దిరిగి పోవుట కవకాశము లేక విరహవేదనమున రాత్రి గడిపెను. పినవీరభద్రుఁ డావిషయమున వనగజమునకు బదులు దుష్యంతునినగరి వేఁటపులిని గల్పించెను. కారణము మృగ్యము.

(III) కాళిదాసుని నాటకమందు—కణ్వాశ్రమమున దుష్యంతునిఁ గొంతకాల ముంచుటకుఁ దదాశ్రమమున నధ్వరాచరణవిషయమును, రాక్షసాటోపంబును, దుష్యంతునిచేఁ గ్రతురక్షణంబును గల్పింపఁబడి స్వల్పమాత్రముగ సూచింపఁబడినది. రౌద్రవీరరసద్యోతనంబుగ నీఘట్టము పినవీరభద్రుని గ్రంథమున నతివిపులముగ వర్ణింపఁబడుటచే శృంగారరసప్రధాన మగుకావ్యంబున మితిమీఱి కొంతరసాపకర్షణముగా నున్నదని నాతలంపు.

(IV) మూలకథయందు శకుంతల తనపంచవర్షవయస్కుఁ డగుకుమారుని దీసికొని దుష్యంతునియొద్దకు వెళ్లినట్లును, కాళిదాసునినాటకమున గర్భవతిగానుండియే రాజునొద్దకు వెళ్లినట్లు నున్నదని యిదివఱలోఁ జెప్పితిని. ఈ రెంటిలోఁ బినవీరభద్రుఁడు మూలకథలో నున్నదానినే గ్రహించి తనగ్రంథమున వాడుకొనెను. పురాణమునందువలెనే ప్రబంధమునందును గొలఁదినియమములు లేకపోవుటచేఁ గాలవిలంబనమువలన దోషములేదుగాన యీకవివర్యుఁ డట్లుచేసె నని యూహింపవలసియున్నది.

(V) మూలకథలో లేకపోయినను గాళిదాసునినాటకములో నున్నటులు దూర్వాసునిశాపమును, అంగుళీయకప్రభావమును పినవీరభద్రకవి తనగ్రంథమున నుపయోగించుకొనెను.

(VI) శకుంతలావిస్మృతినిఁ జెందినదుష్యంతునకుఁ బునఃస్మరణము గలుగఁజేసినవి—భారతమందు నాకాశవాణియు, కాళిదాసునందు నంగుళీయకమును; ఈ రెంటిని రెండుగ్రంథములనుండియుఁ దీసి పినవీరభద్రుఁడు తన కథయందు జతపఱిచెను.

ఇట్లు మూలకథనుండి కొంతయు, కాళిదాసునికథనుండి కొంతయుఁ దనప్రబంధమున కుపయోజ్యము లగుభాగములను స్వీకరించి కథాసంవిధానమెంతయు నుచితముగను, రసపోషకముగను నిర్వహించె నని నిష్పక్షపాతబుద్ధితోఁ జెప్పవచ్చును.

శృంగారశాకుంతలమందలి కవిత్వలక్షణము :—"కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు శకుంతలా" అనునార్యోక్తి ప్రకారము సంస్కృతవాఙ్మయమం దత్యున్నతస్థాన మలంకరించుచున్న యీమహానాటకమును గొంతవఱకైనను బ్రాచీనాంధ్రకవులలోఁ బేరెన్నికఁ బొందిన యొకకవివర్యునిచేఁ దెనిఁగింపఁబడుట మనయాంధ్రుల భాగ్యవిశేష మని నొక్కి వక్కాణింపఁదగును. ప్రపంచమందలి యుత్తమకవులలో నొకఁడుగ గణింపఁబడుచున్న మహాకవి కాళిదాసునిగ్రంథములలో నుత్తమం బయినయీనాటకము కవిత్వమున నేమి నాటకతత్త్వమున నేమి యాదర్శప్రాయమై విరాజిల్లుచున్నదిగదా! అందలికమనీయకవితామాధుర్యమును బ్రాచీనాంధ్రకవులనోటను మృదుమధురభణితి వినిన వీనులకెంతమనోహరముగ నుండునో యూహింపఁదగును.

ప్రాచీనాధునికకవులలోఁ గవితాగౌరవవిశేషమునఁ బ్రాచీనకవు లెక్కుడుమిన్నలు. మృదుమధురపదసంపదలు, రసపూరితవర్ణనలు, కావ్యనిర్మాణనైపుణములు, ఇత్యాదికావ్యశుభలక్షణము లన్నిటియందు, ప్రాచీనకవులు మార్గదర్శకులు, ఆదర్శభూతులు. అట్టివారిచే సంస్కృతవాఙ్మయమందలి యుద్గ్రంథము లాంధ్రీకరింపఁబడుట యాంధ్రభాషాయోషిల్లలామ లోకప్రశస్తి నొందినయుత్కృష్టాలంకారములఁ దొడిగినదైనది. పురాణేతిహాసములు, సనాతనధర్మసంబంధము లగుటచేఁ బ్రథమస్థాన మలంకరించినవి. ప్రథమాంధ్రకవులు చాలవఱకు భగవద్భక్త్యుపయోగ్యము లగుగ్రంథములను దెనిఁగించిరి. కాని తక్కినవానిని—అనఁగా నాటకములను, కావ్యములను జాలవఱకు ముట్టనేలేదు. పినవీరభద్రకవి పూర్వులవలెఁగాక శృంగారరసప్రధాన మగునీనాటకమును దెనిఁగింపఁ బూనుకొనెను. కాళిదాసునిమృదుమధురవాక్కు నిబ్బంగిఁ జవిఁజూప నిచ్చగించెను.

ఈమహనీయకృతి నిర్వహింపసమర్థుఁడు పినవీరభద్రుఁడే యని వెన్నయామాత్యుఁడు మనకుఁ దెలియఁజెప్పెను. నన్నయభట్టు ప్రబంధవాసనాసంపత్తియుఁ దిక్కయజ్వవాక్ఫక్కికామోదమును, నాచనసోమునివాచామహత్త్వమును, శ్రీనాథునిభాషానిగుంఫనములును, ఈయనయందుఁ గాన్పించుచున్నవనియు, నీయనయొక్క పితృపైతామహంబుగఁ గవిత్వలక్ష్మి వెలయుచున్నదనియు వెన్నయామాత్యుఁడు నిస్సందేహముగా మనకుఁ జెప్పెను. ఈతనిపలుకు లవగ్రహము లగుస్తోత్రపాఠములు గాక, యథార్థవాక్యములే యని మనకగుపడుచున్నది.

పినవీరభద్రుని కవిత్వమునందు ముఖ్యముగా పరసపదోరచనల సుధామాధుర్యము గగనధునీతరంగములవలె నిరంతరామోద ముద్భవింపఁ జేయుచుండును. ఈతనికవితాధార నిరర్గళమైన ప్రవాహమును బోలియుండును. ఒకచోటఁ జల్లనిపిల్లవాయువులచే సంచలితమై సన్నగ ధ్వనించుచున్న సెలయేటివలెను, వేఱొకచోట నిరంతరధారాసంపాతమున నిర్ఘోషించుచు మహాప్రవాహవేగమునఁ దల్లడిల్లి పెల్లున వెల్లివిరియు కల్లోలినివలెను, నైసర్గికముగా నప్రయత్నముగా నీతనివాక్సుధాలహరి ప్రవహించుచుండును. పద్యములు కమ్మచ్చునఁ దీసినబంగారుతీఁగలవలె నింపుసొంపులనీనుచు మహావేగమునఁ బరుగులిడుచుండును.

ఈయనకుఁ దెలుఁగుశబ్దములకంటె సంస్కృతశబ్దము లెక్కుడువాడుక. అందులో దీర్ఘసమాసములు దఱచుగఁ దటస్థించును. శైలివిషయములో శ్రీనాథునిశైలిని లక్ష్యముగా నిడికొనినట్లు గాన్పించుచున్నది. శ్రీనాథునికవిత్వమందున్న గుణావగుణము లీతనికవిత్వమునందు నావిధముగానే గాన్పించుచున్నవి. శ్రీనాథునివలె, పినవీరభద్రుఁడు గొప్పపండితుఁడు. బహుగ్రంథపారంగతుఁడగుటచే నీతనికవిత్వమందు పూర్వకవులవర్ణనలు నప్రయత్నముగాఁ బ్రసరించి తమచ్ఛాయ నంతర్లీనముఁ జేయుచుండును.

కథాకథన మతిసరసముగను, మనోహరముగను, చిత్రపటవర్ణనాదికములతో నేత్రపర్వముగ నుండి విసుగుగలుగనీయకుండఁ దత్తత్కాలోచితవర్ణనలతో నలరారుచుండును. నాటకమందు నూతనపాత్రలు ప్రవేశించునపుడు తెరమాటునుండి దడాలున దృగ్గోచర మగునట్లు, ఈకవి, కథయందలి క్రొత్తక్రొత్త లవస్థలను వర్ణించునప్పు డద్భుతరసావేశము గలిగించు నూతనకల్పనలతోఁ బ్రారంభించును. శ్రీనాథునిపద్ధతి యదియే. పెద్దనాదులు నీకథనచమత్కృతినే యనుసరించిరి. మనుచరిత్ర వసుచరిత్రల కథాక్రమముఁ జూచినయెడల పినవీరభద్రునితీరు వారి కెంతమార్గముఁ జూపినదో తెలియవచ్చును. విస్మయజనకము లగురుచులఁ బుట్టించు రసవికాసకల్హారములను, మనోజ్ఞభావవృష్టిని నెలకొల్పు మృదుశబ్దపరంపరలను, కథాకథనము నప్రయత్నముగఁ బరిపోషించి శ్రోతల నానందాబ్ధి నోలలాడునట్లు చేయుచుండును.

మ. చలదిందీవరచారునేత్ర సముదంచచ్చంచరీకాలకం
జలజాతాననఁ గంబుకంఠి బిసహస్తం జక్రవాకస్తనిం

పులినశ్రోణి మరాళరాజగమన న్మ్యాళాని గాంచె న్నట
జ్జలకల్లోలపరంపరానినదవాచాశాలిని న్మాలినిన్.

శా. చంచత్పల్లవకోమలాంగుళికర న్సంపూర్ణచంద్రాననన్
వ్యంచచ్చందనగంధి గంధగజయానం జక్రవాకస్తనిం
గించిన్మధ్యఁ దటిల్లతావిలసితాంగిం బద్మపత్రాక్షి వీ
క్షించెన్ రాజు శకుంతల న్మధుకరశ్రేణీలసత్కుంతలన్.

ఉ. ఎంచి నుతింపశక్యమె యహీశ్వరునంతటివాని కైన ర
త్నాంచితరోచిరుద్గమనిరస్తసమస్తరవీందుజాలమున్
గాంచనకందరాయువనికాయుతవాఃధరాంతరాళ
నిర్వంచితదేవతామిథునవాంఛితమూలము శీతశైలమున్.

ఈకవియందు వర్ణనచమత్కృతి చాలదెక్కువ, భావనావైశద్య మపారము. ఇతఁడసామాన్యపాండిత్యగౌరవమున జంకుగొంకులు లేక ధైర్యమునఁ గవితోద్యోగము నిరాఘాటకముగ నిర్వహింపసమర్థుఁడు. తనశక్తి తనకు బాగుగఁ దెలియును. ఉన్నదానికంటెఁ జెప్పికొనుట గూడ హెచ్చే ! ఆత్మవిశ్వాస మత్యధిక మగుటచే శ్రీనాథునివలె రసనిరూపణమందుఁ బ్రమాదములు గలుగుచుండును. శకుంతలయొక్క ప్రేమానురాగము గుఱించి దుష్యంతుఁడు, అనసూయాప్రియంవదలతో భాషించినపరిహాసోక్తు లంతసరసముగ నుండలేదు. కూరగాయలబేరము జరిపిన ట్లుండుటయే గాక వేగిరపడి నిశ్చితాభిప్రాయముఁ జెప్పెను. తొందరపెట్టుట సుకుమారకేళి వధూప్రేమ నాకర్షించెడివిధము కాదని నానమ్మకము.

క. మాసామ్ము మాకునొసఁగిన, మీసామ్ము స్మరకు మగుడ మీమాసామ్ము
ల్వాసివడకుండ నూరకఁ,గోసన మేమిటికి మాన్చుకొనియెద మెందున్.

గీ. ఇందులోనిష్టమెద్ది మీయిందుముఖికి,నడుగుఁ డెడమాటలకుఁ బ్రాస్తునిడివిలేదు
సాయమవసానమైనను పవనరక్ష, కొదవవలెఁగాని యింకను నుండరాము.

మఱియొక దృష్టాంతము :—

శకుంతలాదుష్యంతులకు గాంధర్వవివాహ మైనపిమ్మట కణ్వమహాముని శకుంతలను బృచ్ఛించినవిధము చాల విరసముగా నున్నదని నాతలంపు.

---

* ఈపద్యము శ్రీనాథుని హరవిలాసములోఁ గూడ నున్నది.

వ. అని యంతాంతరంబుల యోగక్షేమము లడిగి కాలత్రయజ్ఞానశీలుండు
సకలంబు నెఱింగియు, నెఱుంగనివానిఁబోలె నమ్మెలుంగుఁబోఁడి తెఱంగు
తన్ముఖంబున విన నున్ముఖుండై యిట్లనియె !

ఉ. ఎన్నఁడులేని క్రొత్తసిరి నీ నెకుఁవదనాంబుజంబునై
చెన్నను నూన్నరేఖవిలసిల్లెడు భావము లెన్ని యెన్నియుఁ
మున్నిటిభంగిఁగాక కడు మోహనలీలలఁ గ్రాలుచున్న వీ
యున్ననిజంబు దాఁచుకొనియుండిన నాపయి నాన వెట్టెదఁగా.

గీ. అనిన గజగజవడఁకుచు నశ్రువారి, కన్నుఁగవరాల గద్గదకంఠయగుచుఁ
గొంతయును మాటు వెట్టక కోమలాంగి, మునికివిన్నపమొనరించె మునికిమునికి.

ఇది నూతనప్రియాసంభోగము నొందిన కూఁతునితో నిత్యబ్రహ్మచారి యగుతండ్రి భాషించెడువిధమా? రసికులు నిర్ణయింతురుగాక !

ఈసందర్భమున రసికాగ్రేసరుఁ డగుకాళిదా సనుసరించిన మార్గముఁ జూతుఁడు. వీరిగాంధర్వవివాహముఁగూర్చి యశరీరవాణి చెప్పఁగా నామునిపుంగవుఁ డామెయొద్దకుఁ బోయి కౌఁగిలించుకొని "బిడ్డా! కన్నులఁ బొగకమ్ముకొనియున్నను భాగ్యవశముచేత హోమకర్తచేతియాహుతి యగ్నిహోత్రములోనె పడినది. మంచిశిష్యున కిచ్చిన విద్యవలె నీవును నాకు సంతోషహేతు వైతివి. ఇప్పుడే ఋషులను దోడిచ్చి నిన్ను నీభర్తసన్నిధికిఁ బంపెదను." అని చెప్పెను. భారతమునందుమాత్రము ముని తనదివ్యజ్ఞానముచేతఁ దెలిసికొన్న ట్లున్నది.

ఇట్లు కొన్నికొన్నిస్థలములలో రసభావప్రమాదములుఁ గాన్పించుచున్నవి. పాత్రోచితసంభాషణ సంఘటనమున సామాన్యముగ నీకవి యతిసమర్థుఁడని తోఁచదు. శృంగారరసవర్ణనలు తఱచు రసవంతముగను మృదుమధుర వచోయుతముగ నింపారుచున్నవి.

విప్రలంభశృంగార మెప్పుడు నొక్కటేపక్కిగా నుండి చదువరులకు విసువు గలిగించుచుండును. దుష్యంతుఁ డీగ్రంథ మందు సుమారు నూఱుమార్లు విరహావేదనలఁ బొందినట్లు వర్ణింపఁబడెను. ప్రతిమాఱును దుమ్మెదల రొదలు, కోయిలలకూఁతలు, చిలుకలపలుకులు నిత్యాది సామాన్యకవిసంప్రదాయసిద్ధములగుసాధనములే యుపయోగింపఁబడినవి కాని క్రొత్తకల్పనలు గాని మదనోద్వేగసూచకము లగుమనోవికారచేష్టితములు గాని వర్ణింపఁబడ

లేదు. పెద్దన, పింగళి సూరన మొదలగుకవు లీవిషయములో నెంతమనోహరముగా వర్ణించిరో చూడవచ్చును. ఈకవికిఁ బ్రపంచానుభవజ్ఞానము తక్కువ, గ్రంథపఠనజ్ఞాన మెక్కువ యనియుఁ దోఁచుచున్నది. ఆకారణముచేతఁ బూర్వగ్రంథములలో నున్నవిరహవర్ణనలను గొంచెముగా మార్చి తనగ్రంథమం దిడుకొనెను.

ఆంధ్రవాఙ్మయమున శృంగారరస ముత్కటముగా నిరూపించుట శ్రీనాథునితోఁ బ్రారంభించి పినవీరభద్రుఁడు, పెద్దన, సూరన్న మొదలగువారిచే వృద్ధినొంది దక్షిణదేశమున ముద్దుపళని, శేషము వేంకటకవి మున్నగువారి చేతులలో వెఱ్ఱితలలు వేసి పరిహాసాస్పద మయ్యెను.

పినవీరభద్రుని శాకుంతల మందు శృంగారరసవర్ణనలకంటె యుద్ధవర్ణనము చాలరసపూరితముగ నున్నదని చెప్పవచ్చును. ఈయుద్ధవర్ణనము గ్రంథమం దనుచితమయినను స్వాభావికవర్ణనలతో నలరారుచున్నది.

రగడ. లలితహృదయము లివిరి లంఘించునరదములుఁ
గులగిరుల నైన డీకొను మదద్విరదములుఁ
వెరలి యురవడి గాలిఁ దెగఁబాఱు వాజులును
సురరాజుసరివచ్చు చుట్టంపురాజులును.
... ...
నిండి సేనాసమితి నేలయీనినమాడ్కి
సహితులకుగుండెల్లాడంగనంతంత,
మహితసైన్యము నిల్పె మాలినీనదిపొంత.

తృతీయాశ్వాసములో హయగతిరగడను వర్ణించిన సైన్యసమరోత్సాహంబంతయు నెన్నిసార్లుచదివినను తనివితీరదు. నిజముగ నారాజసైన్యము మనకన్నులయెదుట నడచుచున్నట్లుండును. బహుశః కర్ణాటరాజ్యసేనానియగు యన్నగారితో నీకవి సమరసన్నాహమున నున్నచమూనివహంబుల వెంబడి కొంతకాలము దిరిగి ప్రత్యక్షముగఁ జతురంగబలంబుల సమరకౌతూహలకోలాహలంబుల వీక్షించి తన స్వానుభవము యథార్థముగ వర్ణించెనేమో యని సందేహము గలుగుచున్నది.

భాషాంతరీకరణము :—కాళిదాసునినాటక మీగ్రంథమునఁ గొంతవఱకుఁ దెనిఁగింపఁబడిన దని యింతకు పూర్వము చెప్పితిని. ఆభాషాంతరీకరణము కథాక్రమముగాఁ గాని, అంకక్రమముగాఁ గాని చేయుటలేదు. అచ్చ

టచ్చట నున్న మేలైనశ్లోకముల నాంధ్రీకరించి కథాసందర్భమునఁ దనగ్రంథమున కలంకారముగా నుంచికొనెను. కాళిదాసుని శిరీషకుసుమకవితాలాలిత్యమును వన్నెచెడకుండ, వాసన పోవకుండ, నవరసభరితముగ నుండునట్లు తెనిఁగించి గీర్వాణకవితామాధుర్యమునుఁ దెనుఁగుబాసయందు యథామూలముగఁ జూపింపవచ్చు నని సిద్ధాంతపఱిచెను.

పినవీరభద్రునితర్వాత నీగ్రంథమును గృష్ణకవియు, నాగరాజామాత్యుఁడును, వేఱువేఱుగా వ్రాసియున్నారు. ఆధునికకవులలో వీరేశలింగముగారు మున్నగువారు కాళిదాసునినాటకమును నాటకరూపముగఁ దెనిఁగించిరి. ఎంతమంది కవు లెన్నివిధముల నీనాటకమును దెనిఁగించిన నవి పినవీరభద్రుని కృతిని మించుటలేదు. పినవీరభద్రునియాంధ్రీకరణమసదృశము, అనతిశయ్యము. కాళిదాసునిశాకుంతలమునుండి రెండుశ్లోకములకుఁ బినవీరభద్రుఁడు చేసిన భాషాంతరీకరణముల నిటఁ బొందుపఱిచెను.

ఉ. విలుగొని వెంటవెంటఁ బృథివీపతి రా శరపాతభీతిఁ దా
మలఁగిమలంగి కన్గొనుచు మార్గముక్రేవకు నడ్డగించుచున్
నిలుచుచుఁ గొంతకొంత గమనించుచు నర్ధముమే[illegible]సి ద
ర్భలు వివృతాస్యపార్శ్వముల రాలఁగ మింటికిఁ జౌకళించుచున్.

చ. కొనకొని తావి మూర్కొనని క్రొవ్విరి మెయ్యెడ వజ్రసూచిరా
యని రతనంబు జిహ్వచవియానని తేనియ గోరుమోపి గి
ల్లని చిగురాకు లాలితవిలాసని కేతన మాలతాంగి దా
ననుభవకర్త యేఘనుఁడో యావిధియత్నఁ మెఱుంగనయ్యెడున్.

మహాభారతమీమాంస.

— చర్ల నారాయణశాస్త్రిగారు —

(గతసంచిక తరవాయి).

మహాభారతమున వర్ణితములైన వ్యక్తులన్నియు నుదాత్తస్వరూపము గలవియై యున్నవి. ఇంతియేకాదు, దానియందు నప్పుడప్పుడు జను దేవతలయొక్క వర్ణన చేయఁబడియున్నది. వారిచరిత్రములు కూడ నుదాత్తములై యున్నవి. ఈసంబంధమున హోమరుయొక్క యిలియడ్డుకంటె మహాభారతమునందలి కుశలతయొకప్పు డధికముగా నున్నది. ఇలియడ్ గ్రంథమున వర్ణింపఁబడిన యూనానీ దేవతలయొక్క నడవడిక మనుష్యులకంటెఁ గూడ నధమముగా నున్నది. వారొకరిమీఁది కొకరు జగడమునకై లేచుచున్నారు. కొట్టుకొని నఱకుకొనుచున్నారు కూడను. వారియొక్క దేవతాత్వము తఱచు నష్టప్రాయముగా నగుపడుచున్నది. మహాభారతమందుఁ గల దేవతావర్ణన యిట్టిదీ కాదు. వారు మనుష్యులయొక్క వ్యవహారములో నిర్వ్యాధముగాఁ జేయిచేసికొనరు ; చేయఁదూర్చక తప్పనియపుడు, దేవతలువలెనే వ్యవహరించుచున్నారు. ఒకయుదాహరణము తీసికొనుఁడు. కర్ణునియొక్క సహజకవచము నర్జుననినిమిత్తము గైకొనునభిప్రాయముతో నింద్రుఁ డొకయుపాయము పన్నెను. బ్రాహ్మణుఁ డేదియడిగినను గర్ణుఁడు లేదనఁడని యతనియొక్క యీవ్రతము నింద్రుఁ డెఱుఁగును. కావున నింద్రుఁడు బ్రాహ్మణరూపధారియై కర్ణుని యొద్దకుఁ జని యతని కవచకుండలముల నడిగెను. దానశూరుఁ డగుకర్ణుఁడు వెంటనే తనకవచకుండలముల నతని కిచ్చివేసెను. కాని యింద్రుఁ డెవఁడో యొకసాధారణమనుష్యుఁడు వలెఁ గవచకుండలములను జంకలో నిఱికించుకొని యలికిడి లేకుండ నచటినుండి దాటిపోవలేదు ; అతఁడు దేవతాస్వభావమున కనురూపముగా వ్యవహరించెను. సంతుష్టుఁడై యతఁడు కర్ణునితో ననియెను,— "నీవు నీమనస్సువచ్చిన వరము నడుగుము" కర్ణుఁ డతని నమోఘశక్తి నడిగెను. ఇంద్రుఁడు, కర్ణుఁ డాయమోఘశక్తి నర్జునుమీఁదఁ గూడఁ బ్రయోగించు నని యెఱిఁగియే యుండెను. అయినప్పటికి నతండు కర్ణునికాశక్తి నిచ్చివేసెను. సారాంశము, మహాభారతమందు వర్ణితములైన దేవచరిత్రములు దేవతలకే తగినయుదాత్తత గలిగియున్నవి. ఇలియడ్డుకంటె మహాభారతమున నీవిశేషగుణ మున్నది.

ఇంక, కవి తనపాత్త్రములయొక్క స్వభావవర్ణన తనకథారచనయం దెట్లు గావించెనో, యిది విచారింపఁబడును. స్వభావప్రకటనము భిన్నభిన్నవర్ణనలచేతను విశేషించిసంభాషణములచేత నగుచున్నది. ఈవిషయమునఁగూడ మహాభారతముయొక్క యతిశయము సర్వశ్రేష్ఠమైనది. మహాభారతముయొక్క రమణీయత దానిసంభాషణములయందే యున్నది. అందీయఁబడినసంభాషణములకు సమానముగాఁ బ్రభావశాలు లగుభాషణములు తదితరస్థలములయందుఁ జాలఁ దక్కువగా నగుపడుచున్నవి. ఆసంభాషణములగుండా భిన్నభిన్నపాత్త్రములు చక్కఁగా వ్యక్తము లగుచున్నవి. ఇటువంటిసంభాషణములకుఁ గొన్నియుదాహరణము లీయఁబడుచున్నవి:—ఆదిపర్వములో, యౌవనదశయందు దుర్యోధనుఁడు, కర్ణుఁడు, అర్జునుఁడు, మఱి భీమునియొక్కయు సంభాషణములు ; వనపర్వమునకు మొదట శిశుపాలునియు భీష్మునియు సంభాషణములు ; అందే యుధిష్ఠిరుఁడు, భీముఁడు, మఱియు ద్రౌపదియొక్కయు సంభాషణములు ; ద్రోణపర్వమున ధృష్టద్యుమ్నుఁడు ద్రోణుని బఱిమార్చినపుడు, ధృష్టద్యుమ్నసాత్యకులయు, నర్జునయుధిష్ఠిరులయు సంభాషణములు; కౌరవసభయందు శ్రీకృష్ణునియొక్క యేసంభాషణము కలదో, అది యన్నింటను శిరోమణియై యున్నది. కర్ణపర్వమునందుఁ గర్ణునిరథముమీఁదికి దాడి వెడలిన సమయమున నర్జునునితో శ్రీకృష్ణుఁడు చేసినయుత్సాహజనకమైనభాషణముకూడ నిట్లేయున్నది. ఇవ్వి యట్లే యితరభాషణములు భారతకారుని యుత్తమకవిత్వమునకు, పాత్త్రులగుచున్నవి. భారతమున వర్ణింపఁబడిన వ్యక్తుల భాషణములందు నవి ప్రభావంతములుగను నిర్భయములుగను నుండుట విశేషగుణము. ఉదాహరణార్థము, దుర్యోధనుని కుపదేశించునపుడు విదురుఁ డతని నదలించుటలో ముందువెనుకలు చూడలేదు. విదురుని కది యతని పెద్దతనమునకుఁ దగియున్నది. కాని శకుంతలకయితే యది కూడ నాధారము కాదు. అంతయైనమీఁదఁ గూడ నామెకు రాజసభయందు దుష్యంతునితోడి భాషణము నిర్భయమైయున్నది. మఱియు సదాచారసంపన్నయు సుగుణవతియు, నాశ్రమవాసినియు నగునొకకన్యకు శోభాదాయకమైయున్నది. కాళిదాసునిశకుంతలకును వ్యాసునిశకుంతలకును భూమ్యాకాశములయంతర మున్నది. ఎపుడు దుష్యంతుఁడు శకుంతలతో నిండోలగమున "నేను నిన్ను మును పెన్నఁడును జూడనేలేను ; అట్టిచో నిన్ను వివాహముచేసికొంటిననుట యెట్లు?

అని నుడివెనో, ఆసమయమునఁ గాళిదాసునిశకుంతలవలె నామె మూర్ఛవోదు, కాని యిట్లు చెప్పుచు సభాస్థలమునుండి వెలుపలికిఁ బోవుచున్నది. "నీవు సత్యమునే యాదరింపవేని, నేను నీసహవాసమును గూడ నపేక్షింపను. సత్యము పతికంటెను బుత్రునికంటెనుగూడ మిగుల విలువగలది—"

కర్ణపర్వమునందు, శల్యునికిని గర్ణునికిని జరిగినసంభాషణముకూడ నిదే విధముగాఁ జుఱుకైనదియుఁ బ్రభావముకలదియు నైయున్నది. ఇంకే హంసకాకీయ మనిపేరుగల యొకకథ కలదు, అది యెంతయుఁ జిత్తాకర్షకముగా నున్నది. నీతియందలి తత్త్వములను మనస్సున కెక్కునట్లు చేయుటకై చెప్పఁబడిన పశుపక్షులయొక్క కథలకు నిది యన్నిటికన్నఁ బ్రాచీనమును హృదయంగమము నగునుదాహరణము. అనఁగా నీపద్ధతి 'నీసబే' క్రొత్తగావ్యాపింపఁజేసెనని యనఁగొనరాదు ; ఇఁక నేమంటేని యిది 'యీసబు' కంటెఁగూడ నధికప్రాచీనము. ఇంకను వ్యాసమహాకవియొక్క కావ్యమున నిటువంటివి రెండుమూఁడుకథలు చూపవచ్చును. వ్యాసమహాకవి తనకావ్యమునఁ జాల సంభాషణములను బొందుపఱిచియున్నాఁడు. వానివలనఁ బాఠకులహృదయమునందు నీతితత్త్వముల యుపదేశము చక్కఁగా నాటుకొనుచున్నది ; మఱియును సత్యవాదిత్వము, ఋజుత్వము, స్వకార్యదక్షత, ఆత్మనిగ్రహము, ఉచితాభిమానము, ఔదార్యము, ఇవి మొదలుగా సద్గుణములయొక్క పోషణము కలుగుచున్నది. మహాభారతమునందు స్వగతభాషణములు లేవు. తరువాతి గ్రంథములయందు నాత్మగతభాషణము లోకమహత్త్వభాగముగా నున్నవి. దానిని వక్తృత్వముచేతఁ బూరించుటకై యాగ్రంథకారులప్రయత్నముకూడ నగుచున్నది. మనయిప్పటి గ్రంథములయందుఁ దఱచుగా నిటువంటిభాషణములు లేవు. బొత్తిగా మహాభారతమున నిట్టిభాషణములు లేవు. వాస్తవికస్థితిని విచారించునెడల నాత్మగతభాషణముల నెన్నఁడు నెవఁడుఁ జేయఁడనియుఁ, జింతనమాత్రము చేయు ననియు నెంచవలయును; ఈచింతనయందు శబ్దములయొక్క లేక యితరవిషయములయొక్క విశేషవిచారము చేయఁబడదు. అగుఁగాక ; ఈప్రశ్నమే విలక్షణముగా నున్నది.

మహాభారతముయొక్క వర్ణనశైలి గొప్పతరగతిలోనిది. దానియందీయఁబడినవర్ణనలు హోమరుకంటెఁ బక్షాంతరమున మిల్టనుకంటె నెట్లును శక్తియందుఁ దీసిపోవు. వర్ణనచేయునపు డెట్టిగడబిడయు నగుపడదు ; శబ్ద

ములు సరళములును ప్రభావశాలులు నగుచున్నవి; అట్లు దృశ్యములవర్ణన, స్త్రీపురుషులస్వరూపము, స్వభావము, వస్తువులవర్ణనయు మనోహరములై యున్నవి. వ్యాసుడు చేసిన యుద్ధవర్ణన చాల సరసమైయున్నది. ఇంతేకాక యది యద్వితీయమని కూడఁ జెప్పవలయును. ఔను, ఒక్కప్రసంగమే యప్పు డప్పుడు నూటిసారి [illegible] చదువరులమనసునకు విసుగుపుట్టుట నిజము; కాని యీప్రసంగములు సౌతి చేర్చిన వని జ్ఞప్తియుంచుకొనవల యును. ఇదిగాక యింకొకవిషయమున్నది. ఎప్పుడు యుద్ధమునకు శస్త్రములు ధనుస్సులు, బాణములే ప్రధానములై యుండెనో, ఎపుడు రథికులయందు ద్వంద్వయుద్ధములు తఱచుగా జరుగుచుండెడివో, అప్పటియుద్ధప్రసంగముల కల్పన యిపుడు మనహృదయములందు నాటవలసియున్నది. ఇప్పటికిఁ గొన్ని వందలయేండ్లనుండి రథయుద్ధములు, గజయుద్ధము లన్నమాటయే లేదు, కనుక నేఁడు మనము సరిగా, నట్టియుద్ధములయందు నెట్టినిపుణత, శూర త్వముఁ గావలసియుండెనో, కల్పన చేయఁజాలము. వ్యాసకృతమైన యుద్ధవ ర్ణన యొక్కొకపుడు కాల్పనికముగాఁ దెలియుచున్నదని పరిణమించుచున్నది. ఇట్టియుద్ధములయందుఁ గూడ నేవంకలకొలఁది వేయువేలప్రసంగము లుప స్థితములైనవో, అన్నిటియొక్క వర్ణనయు నూత్నతతోడను, వక్తృత్వము తోడను జేయఁబడియెను. మహాభారతమునందలి యుద్ధప్రసంగముల కథలను విన్నచో వీరరసము జనియింపక మానదు. మహాభారతశ్రవణముచేతనే శివా జీవంటివీరుని హృదయమునందు శూరత్వము స్ఫురించె నని ప్రసిద్ధికలదు.

సృష్టిసౌందర్యవర్ణనలు మహాభారతమం దెక్కువ లేవు; ఉన్నవి కూడ రామాయణమునందలి వర్ణనలువలె సరసములుగా లేవు. అయినను మహా భారతముయొక్క తరగతి యితరకావ్యములకంటె శ్రేష్ఠమే యగుచున్నది. ఎందుచేతననఁగా, ఇందు చేయఁబడినవర్ణనలు కన్నులారఁజూచినవారివి యగు చున్నవి. వనపర్వమున హిమాలయవర్ణన యున్నది. అది దానిహిమాచ్ఛాది తమైన యున్నతప్రదేశమునఁ బ్రత్యక్షముగా నివసించువానియొక్క ముఖము నుండి యగును. ఎటువంటితుపానున ద్రౌపదియుఁ బాండవులుఁ జిక్కువడిరో, అటువంటితుపానులు హిమాలయమునందే వచ్చుచుండెడివి. ఆతుపానుల యొక్క వర్ణన మంతసరసముగను వాస్తవికముగను నాప్రదేశమునందు నివ సించిన కవియే చేయఁజాలును. గంధమాదనపర్వతముయొక్క వర్ణన యతిశ

ద్యోక్తులతో నిండిన కారణముచేతఁ గొంత కల్పితముగా నగుపడును; కాని సత్యమైనవిషయ మేమనఁగా గంధమాదనపర్వతముకూడ మేరుపర్వతమువలెఁ గొంతకొంత కాల్పనికమే యగుచున్నది.

మహాభారతమం దున్న స్త్రీపురుషవర్ణన లతిమనోహరములు మర్యాదాయుక్తములును నగుచున్నవి. ఇప్పటిసంస్కృతకవులచేతఁబోలె నీగ్రంథమున స్త్రీలయొక్క సౌందర్యవర్ణన గ్రామ్యరీతిని జేయఁబడలేదు. యుధిష్ఠిరుఁడు ద్రౌపదిని వర్ణించెను. అది చూడఁదగియున్నది. "ఏది యంతపొడగరియుఁ బొట్టిదియుఁ గాదో, ఏది లావు సన్నముఁ గూడఁ గాదో, దేనినేత్రములు శరదృతువునందలి కమలపత్రంబులట్లు విశాలములు సుగంధయుక్తములు నగుచున్నవో, ఒకవమనుష్యుఁడు తనస్త్రీ నెంతయం దముగా నుండవలయునని, కోరునో అంతయందముగా నెవర్తుక యున్నదో; ఎవతుక నేను నిద్రించిన వెనుక నిద్రించునో, నేనులేవకమునుపు లేచునో; ఇట్టినాస్త్రీ యగుద్రౌపదిని జూదమున నొడ్డుచున్నాను." అగుఁగాక; బృహన్నలావేషమున నున్నయర్జునునియొక్క వర్ణనయెంతో రుచ్యముగానున్నది. భీష్ముఁడు ద్రోణుఁడును యుద్ధమునకుఁ బోవునప్పటివర్ణనయు, ఆదిపర్వమునఁ బిలువకుండనే రంగభూమికిఁ జనుచున్న కర్ణునియొక్క వర్ణనయుఁ జాలఁ జిత్తాకర్షకములుగ నున్నవి. ఈయుదాహరణములచేతఁ బైవిషయము స్పష్టమగుచున్నది. ఇపుడు నాల్గవయంశము, అనఁగా వృత్తములు భాషయు విచారింపఁబడును.

మహాభారతరచన ముఖ్యముగా ననుష్టుప్వృత్తమునఁ జేయఁబడినది; చాలచోట్ల నుపజాతివృత్తముకూడ నుపయోగింపఁబడెను. గంభీరకథావర్ణనకును మహాకావ్యమునకును నీవృత్తము లన్నివిధముల యోగ్యములైయున్నవి. అర్వాచీనసంస్కృతమహాకావ్యములలో నీవృత్తము లుపయోగింపఁబడినవి. పురాణములయందును, నుపపురాణములయందు నితరసాధారణగ్రంథములందుఁ గూడ ననుష్టుప్ఛందస్సే యుపయుక్తమైనది. కాఁబట్టి యావృత్తము సాధారణమైనదివలె నున్నది. కాని ప్రాచీనమహాకావ్యములలోని యనుష్టుప్ శ్లోకములు చాలఁ బ్రౌఢములుగను గంభీరములుగను నున్నవి. ఈవిషయము, రఘువంశమునందుఁ బ్రథమ, చతుర్థసర్గములలోని శ్లోకములను జూచినయెడలఁ బ్రతివానియొక్క ధ్యానమునకు రాఁగలదు. మహాభారతమునందలి భావ గంభీరముఁ బ్రౌఢమునై యున్నది. ఇదేవిధముగా నత్యాది సరలము శుద్ధముఁగూడ

నైయున్నది. సరలతయును బ్రౌఢిమయును నొకచో సమావేశము లగుట బొత్తిగా దక్కువగా నగుపడుచున్నది. అధునికమహాకావ్యములయొక్క భాష యుదాత్తము ప్రౌఢమైయున్నది. కాని యీగుణము సిద్ధించుటకై వానియందు సరలత్వము త్యజింపవలసెను. శబ్దములయొక్క రమణీయమైనధ్వని పాఠకులకుఁ జక్కఁగా లగ్నమగుచున్నది. సరే, కాని శబ్దములయర్థముఁ దెలియుటకై వా రాఁగవలసివచ్చుచున్నది. ఆలోచనాసైతము చేయవలసివచ్చుచున్నది. అధునికపురాణగ్రంథములదశ తాఱుమారైనది. వానియందలిభాష సరలము, కాని, యదిమిగుల నపరిశుద్ధము. అందుఁ బ్రౌఢత్వ మన్నమాట కూడ లేదు. మహాభారతమునందు రెండుగుణములు—ప్రౌఢత్వము, సరలతయు—దృష్టము లగుచున్నవి. వ్యావహారికభాషకు నధిపతియుఁ, బ్రతిభాశాలియు నగునొకకవి యెటువంటిభాష నుపయోగించునో, అటువంటిభాషయే మహాభారతములోనిది. 'ఆర్నల్డు' ప్రౌఢతావిషయమున నిట్లుచెప్పుచున్నాఁడు. "మిల్టనుయొక్క కావ్యభాష గంభీరత్వమున కెటువంటిది కావలయునో, యటువంటిదే;" కాని యదిశుద్ధము నమిశ్రితము నగునింగ్లీషుభాష కాదు. అందు లేటిన్, గ్రీక్కు శబ్దములును, శబ్దరచనలును నిండియున్నవి. సారాంశము, భాషాదృష్టిచేతఁ గూడ మహాభారతముయొక్క తరగతి మిల్టనుకావ్యముకంటె గొప్పది. మహాభారతములోని కొన్ని ప్రధానభాగములయందు నుపయోగింపఁబడిన భాషనుండి, సంస్కృతభాష వేలకొలఁదిజనులయొక్క వ్యావహారికభాషగా నున్నపుడు, శుద్ధమై సరలమౌ సంస్కృతభాషయందుఁ బ్రౌఢమైన శబ్దరచన యుండుట యెంతవఱకు సంభవమో వెల్లడియగుచున్నది.

మహాభారతమందు వ్యాసకృతమైనమూలభాగముయొక్క భాష యితరభాగములలోని భాషకంటె విశేషముగా సరసము, సరళము, గంభీరమునై యగుపడుచున్నది. సౌతికూడ నేమియుఁ దక్కువప్రతిభ గలకవి కాఁడు. కాని యతనిసమయమున సాధారణజనులవ్యవహారమునందు సంస్కృతభాష లేకుండెను. కనుక నతనిచేత రచింపఁబడినభాగములోని భాషయందుఁ గొంచెము క్లేశముండుట స్వాభావికము. ఎవరు వ్యాసకృతమూలభారతములోని భాష యెంతప్రౌఢము, శుద్ధము, సరసము, సరలమునైయున్నదియుఁ దెలియఁ గోరుచున్నారో, వారు భగవద్గీతలోని భాష నొకమాఱు తప్పక చూడవలయును. ఏప్రకార మీగ్రంథభాగము సమస్తమహాభారతమునుండి మథించి

వెడలింపఁబడిన యమృతమై యున్నదో, అదేప్రకారము దానియొక్క భాష కూడ నమృతతుల్యమై యున్నది. ఏప్రకారము దానియందు మహాభారతమంతటికంటెను శ్రేష్ఠమైన తత్త్వజ్ఞానము నిండియున్నదో, అదేప్రకారము సంస్కృతభాషయందు వ్యాసమహాఋషియొక్క ప్రభుత్వముకూడఁ దుదిదాఁక జేరినదై యాగ్రంథముననే గనుపట్టుచున్నది. సంస్కృతభాషయొక్క సమస్తసాహిత్యమందును భాషాదృష్టిచేతఁగూడ భగవద్గీతకు సమానమైనది మఱి యేగ్రంథమును లేదు. సరలత్వము, శబ్దరచనయొక్క శుద్ధత, వాక్యములయొక్క శ్రావ్యము గంభీరము నగుధ్వని, మొదలగునవి భగవద్గీతాభాషకు నద్వితీయము లగుగుణములు. ఈసర్వోత్తమమైనభగవద్గీతాగ్రంథముయొక్క ప్రతిశబ్దము, ప్రతివాక్యము సువర్ణమయమై యున్నది; ఎందుచేతననఁగా అవి నిజముగా సువర్ణమువలెనే చిన్నవియు, బరువైనవియుఁ, దేజస్సుగలవియును.

పైని జెప్పఁబడినగుణములచేతఁ గాక మఱి యితరగుణముచేతఁగూడఁ, బ్రపంచమునందలి యాగ్నము లగుమహాకావ్యములయందు మహాభారతముయొక్క శ్రేష్ఠత్వము చక్కఁగా స్థాపింపఁబడుచున్నది. ఏమహాకావ్యమునకుఁ బ్రాణము లేక జీవాత్మ యిదే యని చెప్పఁజాలము. కవి యనేకపద్ధతులచేతఁ జనపాఠకులకు మనోరంజనము చేయును. భిన్నభిన్నప్రసంగములయు నట్లే భిన్నభిన్నదృశ్యములయు వర్ణనచేయును; కాని మనోరంజనము గాక యతనికి మఱియొక హేతువగుపడదు. మహాభారతముయొక్క స్థితి యిటువంటిది కాదు. ఏది సమస్తగ్రంథమందు నొకసామాన్యసూత్రమువలె గ్రథితమై యున్నదో, దేనికారణమున నిక్కావ్యముయొక్క ప్రాణము లేక జీవాత్మ స్పష్టముగాఁ బరిచితము కాఁగలదో, అట్టిప్రధానహేతు వొకటి దానియందుఁ గలదు. ఏప్రసంగము వర్ణించునపుడును వ్యాసమహర్షియొక్క నేత్రములయెదుట సర్వదా ధర్మమే యొకవ్యాపకహేతువై యుపస్థితమయ్యెను. అతని యుపదేశ మేమనఁగా "మనుష్యుఁడు ధర్మము నాచరింపవలయును; ఈశ్వరసంబంధులు నట్లే మనుష్యసంబంధులు నగునకర్తవ్యములఁ బాలింపవలయును. ఆప్రకారముగా ధర్మాచరణముచేతనే యతనియుద్దిష్టహేతువు లన్నియు సిద్ధించుచున్నవి. అధర్మాచరణమునకుఁ బరాఙ్ముఖుఁ డగుటతోడనే యతని యుద్దిష్టహేతువు లన్నియు నష్టము లగుచున్నవి. ఇచ్చవచ్చిన ట్లెంతపెద్ద కష్టమైనఁ దటస్థింపనిమ్ము, ఎంతమహోద్దేశమైనఁ గానిమ్ము, కాని మనుష్యుఁ డెన్నఁడును ధర్మమును

విడువరాదు." ఈయుపదేశము ననుసరించియే సౌతి ప్రతిచోట నుపదేశించి యున్నాఁడు. సమస్తమహాభారతమందును ధర్మముయొక్క మహిమ నొక్కి నొక్కి వక్కాణింపఁబడినది. ఏదేని నాఖ్యానమును లేక పర్వమును దీసికొందు, దానితాత్పర్య మిదే యగుపడును. ఇదేతత్త్వముయొక్క జయధ్వని వినఁబడును. "యతోధర్మ స్తతోజయః" ఈప్రకారము ధర్మమును నీతిని బ్రధానహేతువులుగా నుంచుటకుఁ బ్రయత్నము ప్రాచ్యపాశ్చాత్యమహాకావ్యములయందు వేనియందును జేయఁబడలేదు. తనకుఁ దానే వ్యాసమహర్షి తనశబ్దములచేతఁగూడఁ దనగ్రంథమున కిదే తాత్పర్యమును జెప్పియున్నాఁడు. మహాభారతమునకుఁ జివర భారతసావిత్రీనామక మైననాలుగుశ్లోకము లున్నవి. వానియందు వ్యాసమహర్షి తనగ్రంథముయొక్క యీరహస్యమును వెల్లడించెను. వానిలో నొకశ్లోక మిది :—

ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేష నచ కశ్చి చ్ఛృణోతి మే
ధర్మా దర్థశ్చ కామశ్చ సధర్మః కిం న సేవ్యతే॥

అనఁగా "బుజములపై కెత్తి బిగ్గరగా నఱచి మీకందఱకుఁ జెప్పుచున్నాను. కాని నామాట యెవఁడును వినఁడు. ధర్మమువల్లనే యర్థకామములు సిద్ధించుచున్నవి. అట్టిధర్మమును మీరు మఱియెందులకు సేవింపరు?" వ్యాసమహర్షియొక్క యీహృదయపూర్వక మైనయుపదేశమే యీగ్రంథమునకు ముఖ్యతాత్పర్యము. కనుకనే సర్వప్రపంచమందు నీగ్రంథముయొక్క శ్రేష్ఠత్వము చక్కఁగా స్థాపింపఁబడుచున్నది.

ఇంతవఱకు "మహాభారతకర్తల విషయమున విచారము గావించుచు మహాభారతగ్రంథ మెంతగొప్పదో, దానిమూలభాగ మేదో, యెంతయో, మూలభాగమునకు వర్తమానస్వరూప మెట్లు ప్రాప్తమయ్యెనో, యీగ్రంథమునకుఁ గర్తలెవరెవరో యివన్నివిషయములు సవిస్తరముగా వివేచింపఁబడినవి.

ఇంక నీవిషయములే సంక్షేపించుటకు సింహావలోకనము చేయఁబడును. మహాభారతమునందు దాదాపొకలక్షశ్లోకము లున్నవి. ఇంతవిపులమైనరచన యొకకవిదే యగుట సంభవముకాదు. ఇందువలన నీగ్రంథముయొక్క రచన యొకరికంటె నెక్కువకవులు చేసియుందు రని తెలియుచున్నది. ఇరువురు కర్తలు గ్రంథమువల్లనే స్పష్టముగా వెల్లడియగుచున్నారు. వారు వ్యాసుఁడు సౌతియు నైయున్నారు. వ్యాసకృతమూలభారతమును దొలుదొల్త నైశంపా

యనుఁడు ప్రసిద్ధముచేసెను. కనుక ముగ్గురు కర్త లున్నారని యొప్పుకొనుటలో హానియేమియు లేదు. వ్యాసవైశంపాయనుల గ్రంథములయందు న్యూనాధికభావ మెక్కువయుండదు. వైశంపాయనునిగ్రంథమున 24,000 శ్లోకము లుండె నని యూగుపడుచున్నది. మూలగ్రంథమునకుఁ బేరు "జయ" మని యుండెను. వైశంపాయనుఁడు దానికి "భారత," మని పేరుపెట్టెను. అతఁడు మొట్టమొదట భారతసంహితను బఠించెను. ఆశ్వలాయనుఁడు సూత్రమున నతనిని భారతాచార్యుఁ డని చెప్పెను. భారతమునందు 8800 కూటశ్లోకము లున్న వని చెప్పుచున్నారు. దీనిఁబట్టి కొందఱకు వ్యాసకృతభారతమునందలి శ్లోకములయొక్క సంఖ్య యిదే యగునని యనుమానము కలుగుచున్నది; కాని యీయనుమానము సరియైనదికాదు. వ్యాసకృతభారతములోని శ్లోకములసంఖ్య దీనికన్న నెంతేని యెక్కువ కావలసియున్నది. వ్యాసమహాకవి యొడతెగక మూఁడుసంవత్సరములదాఁకఁ బ్రయత్నించి యుద్ధము సమాప్తమైనవెంటనే, తనగ్రంథము రచించెను. వైశంపాయనుఁడు దానిని, గొంచెముగా వృద్ధిచేసెను. 24000 శ్లోకములగ్రంథమును గావించెను. మఱియును సౌతి దానినే యొకలక్షశ్లోకములగ్రంథముగాఁ జేసివైచెను. ఇంత పెద్దగ్రంథముగా రచించుటకు సౌతినాఁడు సనాతనధర్మముయొక్క దశయే ప్రధానకారణము. సౌతిసమయమున సనాతనధర్మమును బౌద్ధజైనధర్మములు ముట్టడించినవి. సనాతనధర్మమందుఁగూడ నప్పుడు పరస్పరవిరుద్ధము లైనమతములాంతరములు ప్రచలితములై యుండెను. కనుకనే యాసమయమందుఁ జిన్నచిన్నగాథల నన్నింటి నొకచోఁ జేర్చి యన్నిమతమతాంతరములు విరోధమును దొలఁగించి యేదే నొకగ్రంథమున సనాతనధర్మముయొక్క యుజ్జ్వలస్వరూపమును బ్రకటించుట యావశ్యకమయ్యెను. ఈరాష్ట్రీయకార్యమును సౌతి పూరించెను. ఇట్లు చేయునపుడు ప్రసిద్ధములైన పుక్కిటిపురాణము లన్నిటిని నతఁడొకచోఁ జేర్చెను. మఱియొకరీతిని గూడ మహాభారతమునఁ జాల నుపయోగించువిషయములను సంగ్రహించెను. సారాంశము—ధర్మము, నీతి, తత్త్వజ్ఞానము, మఱి యితిహాసముయొక్క యొకబృహద్గ్రంథమునే యతఁడు చేసెను. అతఁ డేయేభాగములను వృద్ధిచేసెనో సరిగాఁ జెప్పఁజాలము, ఐన, నీవిషయమున స్పష్టముగాఁ గొంత యనుమానము చేయఁగలిగితిమి. సౌతి యేయేవిషయములను విస్తరించెనో యిఁకఁ గూడ విచారింపఁబడెను. అంతమునఁ గవిత్వాద్య

ష్టిచేత వ్యాసకృతభారతముయొక్క శ్రేష్ఠత్వ మెంతయధికమైనదియు విచారింపఁబడియెను. ఈభారతమందు సౌతి చాలవఱకు క్రొత్తగాఁ బూర్తిచేసియున్నాఁడు. కాని యిందువలన గ్రంథముయొక్క శ్రేష్ఠతకు న్యూనత్వ మేమియు రాలేదు. దానికి మాఱుగా, ధర్మము మఱి నీతియొక్క కథల నుచితముగా నీగ్రంథమున సంగ్రహించినకారణముచేత దీనికి రాష్ట్రీయస్వరూపము ప్రాప్తించినది. దీనివలన మూలగ్రంథమునాఁటి పరిస్థితులుగాక సౌతి దీనిని వృద్ధిచేసినప్పటి పరిస్థితులుకూడ దీనియందుఁ బ్రతిబింబితములై యున్నవి యనియుఁ దెలియుచున్నది. ఆసౌతిసమయ మేదో, యిది విచారించుట యావశ్యకము. ఈసమయము మనము మునుపు చెప్పినట్లుగా అశోకునిదే సమయమో లేక మఱియొకటియో, యింక విదే చూడఁదగి యున్నది.

పత్రికాస్వీకారము.

(1) గోలకొండపత్రిక :—ఈపత్రిక హైదరాబాదునందు సురవరము ప్రతాపరెడ్డిగారిచేఁ బ్రతిబుధవారమును శనివారమును బ్రకటింపఁబడుచున్నది. ఇందు రాజకీయవిషయములును జరిత్రాంశములును జర్చింపఁబడును. సంవత్సరమునకుఁ జందా 7-0-0.

(2) సుజాత :—దక్షిణ హైదరాబాదు నగరమున పి. యస్. శర్మ గారిచేఁ బ్రకటింపఁబడు సచిత్రమాసపత్రిక- ఇందు భాషావిషయములు, చిన్నికథలు, ఖండకావ్యములుఁ బ్రచురణమొందుచున్నవి హైద్రాబాదు ఆంధ్రపరిశోధకసంఘమువారు తాము నూతనముగఁ గనుఁగొనిన శాసనముల నిందు సవిమర్శముగఁ బ్రకటించుచున్నారు. హైదరాబాదురాజ్యమున నాంధ్రభాషకుఁ బ్రాచుర్యమొసంగుటకై యీపత్రికారాజమును బ్రకటన మొనర్చుటచే శర్మగారి ప్రయత్న మెంతయుఁ బ్రశంసనీయము. సంవత్సరమునకుఁ జందా రు 3-0-0.

(3) సుభాషి :—రాజమహేంద్రవరమున పందిరి మల్లికార్జునరావు గారిచేఁ బ్రకటింపఁబడుమాసపత్రిక. ఇందు సారస్వతము, కళ, చరిత్ర, రాజనీతి మున్నగువిషయములు చర్చింపఁబడును. ప్రథమసంచికయందుఁ జిలుకూరి వీరభద్రరావుగారి 'అన్నయదేవుఁడు వింతచరిత్రాంశములు' అనువ్యాసమును కొన్నిఖండకావ్యములునుఁ గలవు. పత్రిక యుపక్రమణికఁ జూడ వ్యావహారిక భాషాపోషణకునై కంకణము గట్టుకొనినటులు గావచ్చుచున్నది. సంవత్సరమునకుఁ జందా 3-0-0

(4) లలిత :—ఈపత్రిక చిరకాలమునకుఁ దిరుగ వెడలినందుకు సంతసిల్లుచున్నారము. ప్రథమసంపుటమున మూఁడవసంచిక మాకార్యస్థానము నలంకరించినది. ఇందుబౌద్ధయుగమునాఁటి'కాళీభూతకథ''భూరిదత్త జాతకము' మొదలగు కథలును, ప్రాచీన యీజిప్తుదేశచరిత్రమును, నేఁటిబాలురవిద్యావిధానమును దెలుపు పరీక్షలను వ్యాసమును గలవు. చందా సం॥కు 3-0-0 వలయువారు మేనేజరు లలితాకార్యాలయము విజయనగరము-అని వ్రాయవలయును.

(5) ఆరోగ్యప్రకాశిక :—డాక్టరు యు. రామారావుగారిచే సంపాదితమై మదరాసున వెలువడు సచిత్రమాసపత్రిక. ఆరోగ్యమును గుఱించి

వేర్వేఱు విషయములఁ జర్చించుచు నాంగ్లమున వెలువడు Health అను మాసపత్రికయు వీరిచేఁ బ్రచురింపఁబడుచున్నది. 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్మ'నున దెల్లరకును విదితమే. ఇట్టిపత్రికలు మనదేశమున వ్యాపించి యారోగ్యాభివృద్ధిసాధకము లగు నని తలంచుచున్నాము. సంవత్సరమునకు చందా రు 1-8-0.

(6) ఆంధ్రభారతి:—మచిలీపట్టణమున తల్లావఝల రామారావుగారిచేఁ బ్రకటింపఁబడుమాసపత్రిక. రెండవసంపుటమున 5 సంచిక మాకార్యస్థానమును జేరినది. వివిధము లగుకల్పనాకథలును గొన్నిఖండకావ్యములును గలవు. చందా రు 3-0-0.

(7) సఖ:—సాహితీసమితికిం జేరిన శ్రీశివశంకరశాస్త్రి వీరరాఘవస్వామిగార్లచేఁ బ్రచురింపఁబడిన పత్రిక. మూఁడుమాసములకొకసారి వెలువడును. సాహితీసమితిసభ్యుల రచనలు మాత్రమె యిందుఁ బ్రకటింపఁబడును. చందా సం॥కు 3-0-0.

(8) The quarterly journal of the Mythic Society, Bangalore ఈపత్రిక పదునెనిమిదవసంపుటమున మొదటిసంచిక వెలువడినది. ఇందు డాక్టరుశ్యామశాస్త్రిగారిచే రచియింపఁబడిన సూర్యప్రజ్ఞప్తి మొదలగువ్యాసములు గలవు. పత్రిక చందా సం॥ కు రు 5-0-0.

(9) గ్రామోపాధ్యాయుఁడు:—తేజోమూర్తుల శివరామయ్య గారిచే గంజాంజిల్లా, లక్ష్మీనర్సుపేటనుండి ప్రకటింపఁబడు విద్యావిషయక పత్రిక. ఇందు బాలురవిద్యావిధానములు మున్నగునవి చర్చింపఁబడును. సంవత్సరమునకుఁ జందా రు 0-12-0.

(10) గ్రామపునర్నిర్మాణము:—గ్రామములందలిసాంఘిక, ఆర్థికవిద్యావిషయములఁ జర్చించుటకు, గ్రామపునర్నిర్మాణమునకు వలయుసాధనములఁ దెల్పుటకు, నరసింహదేవర సత్యనారాయణగారివలనఁ బ్రకటింపఁబడు మాసపత్రిక. సం॥ కుఁ జందా రు 2-0-0. వలయువారు గ్రామపునర్నిర్మాణపత్రికాకార్యాలయము, రామచంద్రపుర, మని వ్రాయవలయును.

(11) రంగూన్ ఆంధ్రపత్రిక:—బర్మాదేశమునందు శ్రీరాములు అండుకొండనీవారివలనఁ బ్రతివారమును బ్రచురింపఁబడు పత్రిక. సాంఘికరాజకీయ సాహిత్యవిషయములు చర్చింపఁబడును. పత్రిక 1 కి రు 0-1-0.

(12) రత్నగిరి :—నూతనముగ సేలంజిల్లాయందలి కాళినాయకనపల్లి గ్రామమునందు గన్నెల్లి మునిరెడ్డిగారిచేఁ బ్రకటింపఁబడు మాసపత్రిక. సాహిత్య, మత, రాజకీయ, చారిత్రకాదివిషయములు ప్రకటింపఁబడును. ప్రథమసంపుటమునఁ బ్రథమసంచికయందు శ్యామము, కోకిలా మున్నగుఖండకావ్యములును, చంద్రముఖియను చిన్నికథయు, కె. వి. ఆచార్యగారిచే రచియింపఁబడిన వేదము లనువ్యాసమును గలవు. తమిళదేశమున నిట్టిపత్రికా రాజమును నెలకొల్పి యాంధ్రభాషాప్రాచుర్యము కలుగఁజేయుటచే రెడ్డిగారి ప్రయత్న మెంతయుఁ బ్రశంసనీయము. సంవత్సరమునకుఁ జందా 3-0-0.

గ్రంథవిమర్శనము.

షాహజహాన్:—శ్రీ ద్విజేంద్రలాలురాయ విరచిత వంగభాషానాటకమున కాంధ్రానువాదము. అనువాదకుఁడు దినవహి సత్యనారాయణగారు. మొగలుచక్రవర్తి యగుషాహజహా నంత్యదశయందు నౌరంగజేబుచే బంధింపఁబడుటయు, దారా, షూజా, మూరాదు లాతనికుట్రలకు లోనయి చంపఁబడుటయు నిందలికథాభాగము. కవి దారాకుమారుఁడగుసులేమాను, భార్య యగునాదిరా, ఔరంగజేబు కుమారుఁడగు మహమ్మదుల పాత్రములను జక్కఁగఁ జిత్రించియున్నారు. షాహజహాఁయొక్క పుత్త్రప్రేమ గ్రంథాంతమునఁ జక్కఁగ సూచింపఁబడినది. ఔరంగజేబుయొక్క రాజ్యకాంక్ష, మహమ్మదీయమతమును బురస్కరించుకొని యాతఁడొనర్చిన దుర్నయములును జరిత్రానుసారముగ వర్ణింపఁబడినవి. పాశ్చాత్యవిషాదాంతనాటకముల ననుసరించి నాదిరా, దారాల మృత్యువు రంగస్థలమునఁ జూపఁబడినది. ఉత్తమనారీశీలమును నాదిరాపాత్రమున లిఖించి తారతమ్యమును సూచించుకొఱకుఁ గవి పియారాపాత్రమును సృష్టించినటులు దోఁచెడిని. పాఠకులకుఁ జిరపరిచితము లగుచంద్రగుప్త, సోహరాబ్ రుస్తుము, మున్నగునాటకముల రచియించిన గ్రంథకర్తనుగూర్చి విశేషించి వ్రాయనవసరము లేదు. సత్యనారాయణగారి యనువాదము హృద్యముగ నున్నది. వెల రు 1-0-0 వలయువారు దినవహి సత్యనారాయణగారు, మార్కెట్టువీథి, రాజమహేంద్రవరమని వ్రాయవలయును.

2. ఆత్మానుభవసాధనేశ్వర శతకము:—పెద్దిభొట్ల యజ్ఞేశ్వరశర్మగారిచే రచియింపఁబడినది. భక్తి, జ్ఞాన, వైరాగ్యవిషయము లిందుఁ జెప్పఁబడినవి. వెల 4 అణాలు.

3. ఈశ్వరశతకము అను సాంఘికనీతిపద్యావళి—గ్రంథకర్త గుర్లపల్లి నారాయణమూర్తిగారు, రాయవరము, గోదావరిజిల్లా. కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగముగారి యుపన్యాసములలోని ముఖ్యవిషయము లిందుఁ జేర్పఁబడిన వని గ్రంథకర్తగారే తెల్పియున్నారు. ఈశతకమునందలి భావములలో మత భేదములున్నవి. శైలిసరళముగ నున్నది. వలసినచో గ్రంథకర్తగారికి వ్రాయవలయును.

4. లోకనాయకశతకము—గ్రంథకర్త మునగపాటి చినహనుమయ్య గారు, మునగపాక, సత్తెనపల్లి. భారతీగ్రంథమండలివారిచేఁ బ్రకటింపఁబడినది. మతవిషయములతో నిమిత్తము లేక నీతిబోధకముగ రచింపఁబడినది. వెల 0-3-0. వలయువారు భారతీగ్రంథమండలి, సత్తెనపల్లి యని వ్రాయవలయును.

5. సమానప్రతిభ:—బళ్లారిపురవాస్తవ్యు లగుపండిత కె. సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే రచియింపఁబడిన 'డిటెక్టివు'నవల. ఆంధ్రప్రచారిణీగ్రంథనిలయమునందుఁ బ్రకటింపఁబడినది. వెల రు 1-8-0.

6. విజయ:—సత్తెనపల్లి భారతీగ్రంథమండలివారిచేఁ బ్రకటింపఁబడిన ప్రథమకుసుమము. మహావాది వేంకటరత్నముగారిచే రచియింపఁబడినది. పల్నాటివీరవనిత యగుశ్రీమతి పురుషవేషమును ధరించి దొంగలగుంపును బట్టుటయే యిందలి కథాభాగము. వెల రు 1-0-0, వలయువారు భారతీగ్రంథమండలివారికి వ్రాయవలయును.

7. శివయోగసారము:—కొలని గణపతిదేవకృతము, ఉత్తరభాగమున ద్వితీయతృతీయాశ్వాసములు వేర్వేఱుసంపుటములుగ శైవప్రచారిణీగ్రంథమాలాసంపాదకులగు కొడిమేల రాజలింగారాధ్యులుగారిచేఁ బ్రకటింపఁ బడినవి. విద్వాన్ ముదిగొండ వీరేశలింగశాస్త్రిగారిచే రచియింపఁబడిన తాత్పర్యమిందుఁ గలదు. వలయువారు మేనేజరు శైవప్రచారిణీకార్యాలయము, వరంగల్, అనివ్రాయవలయును. వెల సంపుటమునకు రు 1-4-0.

[శివయోగసారము గద్యములో "కొలని యాదిమూలనామాత్య పుత్ర" యని యున్నది. ఇంటిపేరు కొలనియాదివారని ముద్రితప్రతులలోఁ జేర్చుచున్నారు. కొలనివారే కాని కొలనియాదివారు కారనియు, "కొలని ఆదిమూల నామాత్యుఁ" డని యుండవలయు ననియుఁ దలఁచుచున్నాము. పూర్వభాగములోఁ గృత్యాది దొరకకపోవుటచే నీసంశయము కల్గుచున్నది. ఇపుడిపు డాపూర్వభాగమును గనఁబడుచున్నది కావునఁ బ్రకాశకులు పరిశీలింతురు గాక]

నూపురమహిమ (లేక) కన్నకిచరిత్రము.

—♦ తి. సు. మురుగేశపిళ్ళెగారు ♦—

—గోవలుఁ డిలు సేరుట—

ఈచందంబున గన్నకియు దేవంతియు మందలించుచుండుతఱి గోవలుఁడు దనయిలుసొచ్చి పడుకటింటిలోఁ దూఁగె మంచముమీఁదఁ గూరుచుండెను. మగనిరాకం గన్నకన్నకి పంటింపక లేచి మగనిచెంగటి కేగి చెంగనా లొనర్చి మోలగించుచుండెను. కన్నకి వగపుచే నొగిలి మొగము సొగసెడలి, యొడలు బడలి చిక్కియుండుటం గని మదిం బొరింబొరిం బొక్కుచుఁ, గన్నకి న్మక్కువతోఁ దిలకించి నాయనుంగుఁబ్రోయాల! వాఁడువాఱియుండు నీమోముఁ జూడ నామదిలో గోడు మూఁడుచున్నది. జూటు న్నేటుగా నాటింపఁగల యాటబోటులతో వాటమైన వలపునం గలసిమెలసి నాపెద్దలు గడించిన లచ్చి నెల్ల విచ్చలవిడి నాఁచముట్టుగా వెచ్చించి నిప్పచ్చరమున కచ్చుపడి నొచ్చితిని. అట్టి చెట్టిదపు నాచెయ్వులకొఱ కెదలో మిక్కుటంపు వెక్కసమూలోసి గ్గగలమగుచున్నది'—యని గోడాడుచు నుడివెను. గోవలునిపలుకులం జెవిగొన్న కన్నకి మాధవికి నిచ్చుటకుం బైకము లేమింజేసి తనపెనిమిటి వనటంబడి యిక్కరణి నుక్కఱి వక్కాణించుచున్నాఁ డని యుంకించి, యతనిం దిలకించి, దేవా ! నాయొద్దఁ గుందనంపుటందియలు రెం డున్నవి ; వలచితిరేని యంకిలింపక పొంకముగా నిచ్చెద. అంకిలినొందక వానిం బుచ్చుకొని యిచ్చమెయిం జరగింపుఁడు' అని పొచ్చెము లేక యుంకించెను. అట్టియింపుమాట లాడినకన్నకిం జూచి గోవలుఁడు జూవరము గొని నాయనుఁగుంబ్రోయాల ! నే నీకొఁడగూర్చిన కిక్కురింతలకై వెక్కసింపక మక్కువమాటలం జొక్కించెదవు ; మంచియాలువు గలయిల్లాలవు గావున యింటియాతని కిం పొడఁగూర్చెదవు. మంచిది ; మనము పాండ్యనాటిలోని మధురాపురమువకుఁ దరలి నీయందియల నమ్మి యందువం గిట్టుపైకమును సంచిమొదలుగాఁ గొని జేరమొనర్చి విరివిగ విడిముడి గడింప సుజ్జగొనుచున్నాఁడ. ఈవును నావెంబడి మధురకు రావలయు' నని గోవలుఁడు ముచ్చటించెను. అందునకుం గన్నకి నెయ్యముతో నియ్యకొనెను. మఱునాఁటి వేగుటకుముందె యీపీసు విడి వెడలవలయు నని యాయిద్దఱును మాటలాడి యుఱివిఁపఱుచుకొనిరి.

గోవలుఁడును గన్నకియు మధురకు తరలుట; కౌంతి

నాఁటిరేయి కడజామునఁ గోవలుఁడును గన్నకియు నిలువదలి బయలుదేఱి, యొరు లెఱుఁగకయుండ నాయూరిం గలమిన్నవన్నెపెరుమాళ్ల కోవెలలోనికిం బోయి, యాదేవుని వలగొని వచ్చి కొలిచి యచ్చోటువాసి వెడలి మధురాపురి తెరువుంబట్టి కావేటిదాపలిగట్టుదారిం బడమటికిం బోయి యుం దొక్కవిరిదోఁటం జేరిరి. అచ్చట జైనమతతాపసి కౌంతి యనుపేరిముసలి యొకతె తపము సేయుచుండుటం గని యామెయుజ్జఁదమ్ములంబడి మ్రొక్కలొనర్చిరి. ఆమెయుఁ దనయడుగులఁ సాగిలంబడి డింగిల్లొనర్చిన వారల దీవించెను. గోవలుఁడును గన్నకియు మధుర కేగుట నెఱిఁగి, వారలం జీరి, 'మధురానగరమునం గలపెద్దలయొద్ద ధర్మశాస్త్రముల వినుటకును, ధర్మస్వరూపిని దర్శించుటకును నేనును మీవెంబడిఁ దరలివచ్చెద' నని చెప్పెను. పిదప, ఆముగ్గురును మధుర కేగు తెరువుంబట్టి నడచి శ్రీరంగము చెంగటనుండు తోఁపొకటిం జేరిరి. అట, జైనమతమందు సిద్ధిఁజెందిన చారణు లిరువురు గంటికగపడుటయు నీముగ్గురు నాయిర్వురి యడుగులఁ వ్రాలి చెంగనాలొనర్చి కయివారము సేసిరి. అప్పు డాచారణులు దశబలుని యడుగుల కెరఁగి పొగడని వారలు పుట్టుక యనుప్రాయేటనుండి యీఁది గట్టుసేరఁజాల' రని నుడివిరి. ఆపలుకుల విని కౌంతి యనునది 'సమంతభద్రుని దప్పఁ దక్కినదయ్యంబుల నాకేలు దోసిలింప'వని వాకొనెను. అప్పుడు, చారణులు 'కౌంతికిఁ బాశము విడువడుఁగాక' యని దీవించి కంచుమింపైరి.

సిద్ధశైను లోలసానగొన్న కొంతసేపటి కాముగ్గురు నచ్చోటువాసి నోడయెక్కి కావేటివలగట్టుసేరి, యందుండినట్టి పెద్దతోఁపొకట విడిసిరి. అప్పుడు, రోఁతవంగడములోఁ బుట్టినయొకశెట్టిమఁడును వాని పెండ్లామును నా తోఁపులోఁ గౌంతి మొదలగుముగ్గురు విడిసియుండువిడిదికి నేగి కౌంతిం గని కన్నకిగోవలుల గుఱించి చూపి 'వీర లెవ్వ' రని యడిగిరి. అందుకుఁ గౌంతి 'వీరలు నాబిడ్డలు; మీరు వారల చెంతకుం జేరక తొలఁగిచనుఁ' డని కట్టడ సేసెను. తోడన, యామిండగులు కౌంతిం దిలకించి 'వీర లిరువురు నాలుమగలుగాఁ గనఁబడుచున్నారే! ఒక్కకడుపునం బుట్టినవారలైన వీరలాలుమగలగుట కావచ్చునని మీజైనమతశాస్త్రములో జెప్పఁబడి యున్నదా?' యని కోఁఅకము సేసిరి. కౌంతి కడుం గాంతాశపడి యావెంబరవిత్తు లిరువుర నక్కలగునట్టు దిట్టెను. అప్పుడె వారలు నక్కలయిరి.

ఈచెయిదములం గన్నకన్నకియు గోవలుఁడు వలమరి, కనికరించి శాప విమోచన మొసఁగునట్లు గౌంతిని బతిమాలిరి. 'వీర లిరువురు నొక్కయేఁడు వఱ్ఱులుగా మిట్టాడుచుండి పిదపఁ దొంటినిలవు లొందుదురుగాక' యని కౌంతి దిట్టువిడుగడ యిడెను. పదపడి కౌంతి, గోవలుఁడు, గన్నకియును ముగ్గురును దోవనడచి నాఁటిమునిమాపున నుఱయూరుసేరి విడిసియుండిరి. (ఈ ఉఱయూరు తిరుచినాపల్లికిఁ బడమరఁ గోసుదవ్వున నుండునట్టి నగరి. ఇది యే చోళవంగడపుమన్నీలకు దరతరమైన రాజధాని, ఈఉఱయూరియందె చోళరాజులు బొమిడిక దాల్చి పట్టముగట్టుకొని మఱి యెందేనియు రాచఱికము సేయుచుందురు.)

శ్రీ

॥ మధురకాండము.

గోవలుఁడు మున్నగువార లుఱయూరు నురలి మధురకుఁ దరలుట:—
ఉఱయూరిలోని జైనమఠమందు మఱునాఁ డంతయుఁ గౌంతి కన్నకీగోవలులు విడిసియుండి యలపుదీర్చికొనిరి. అందుకు మఱుసటినాఁటి వేకువ లేచి యాముగ్వురు నచ్చటనుండి బయలుదేఱి మధురాపురము దారిం బట్టి యేగుచుండు తఱిఁ, దోవలోఁ జైద్దతోఁ బొకటం గలిగిన చపిళయందు వేసట దీర్చికొనిరి. అప్పటి కొక్కపాఱుఁడు పాండ్యరాజును బలువగల వర్ణించి దీవించుచు నాచవికలోనికి వచ్చి విడిసెను.

గోవలుఁ డాబాఁపనిం జూసి 'అయ్యగారు! మీ రేయూరినుండి యేతెంచుచున్నారు?' అని యడిగెను. అందు కాబాఁపనయ్య 'ఏను కుడగు దేశములోని 'మాంగాడు' అను పేరియూరివాఁడ. పాలకడలి నెడలి, మానిసులందఱు మనుటపొంటె కనికరించి, మిన్నుముట్టునట్టి తోఁపులు దోరముగాఁ గలిగి రంగారుచుండు సిరంగములో, వేయిదలలు గలపాఁపతేని యొకలిమీఁదఁ బరుండియుండు శ్రీరంగనాయకుల సేవించుటకును, చేనెలొలుకు, దోఁపుల ప్రాపుమీఱు తిరువేఁకట మనుచిలువమల నెత్తమ్మునందు, నీలిచాయ నెగడు మేలిమొగిలుఁబోని మేనితో నిలఁబడి, చెందమ్మి యందంబునొందు చేతులయందుఁ జాదము, సుడివాలు సెలఁగ జగాజిగి నందగిల్లు తమ్మిరేదండ యొమ్మును దైవాఱ, హొంబట్టుపుట్టము హొయలుమీఱఁ దాల్చి, కెందమ్మితేఁకులవంటి కన్నులతోఁ జెన్నుమీఱి చెలఁగుచుండు కటివేలుపుం గాంచుటకును నాకన్నులు

నాయెడఁద నెనకొలుప నేనిచ్చటి కేతెంచితి. వచ్చుదారిలోఁ బాండ్యదేశములోఁ గల నిగారములను, పాండ్యమన్నని యాగియు నక్కటికమ్ము మున్న గుగానములం జానుగుచవిగా వినఁబడియుఁ, గన్నులపండువుగాఁ గాంచియు నెనలేని మెలకువుతో విలసిల్లుచున్నాఁడఁ గాఁబట్టి యతని బొగడితలం బొగడుచు నిచ్చటికి వచ్చితిని' అని బదులు సెప్పెను. పదపడి, గోవలుఁడు పాలునిం గని మధురకు నేగు దారిని మాకుం జెప్పవలయు నని యడిగెను.

మూంగాటి బోఁపఁడు మధురకుఁ బోవు తెరువులం జెప్పుట :—మూంగాటిపాలుఁడు గోవలునింజూచి 'అయ్యా ! ఎలమావిచిగురుం దెగడునోడలు గల గరితతో నిచ్చటి కీయెండ మిడిమిడి కాలునప్పటి కేతెంచితిరే ! అక్కటా ! వేఁగంటి యెండ వేఁడిమి సీననఁబోఁడి యేలాగున నోర్వఁగలదు ? మధురకుం బోవు తెరువుం జెప్పెద వినుఁడు. ఈకఱుకుటడారిం గడచి చని కొడుంబాళూరు, నెడుంగుళ మనురెండుకోటికలకు నడుమ గలచెఱువుం గడచి చనినయెడ, ముక్కొమ్మునవానిం బోలె పాయవాఱియుండు మూఁడుత్రోవల మధురకేగునట్టి బాటలుగాఁ జూడఁగలరు. ఆమూఁటిలో వలపటిత్రోవం బట్టిపోతిరేని పలుగడుసుటడారులం గడచి చిఱుమలను వలగొనిచని మధురాపురిం జేరవచ్చును. ఇఁక రెండవదియైన డాపలిత్రోవంబట్టి పోవవలచినయెడలఁ బలుకఱుకుటడారులం గడచి 'తిరుమాల్కున్ఱము' అనునళగరుమలం జేరవచ్చును. అందుండి గుబ్బలిబొఱియ యొకటి వెంటం బోవలెను. అచ్చటఁ బుణ్యశరవణము, భవకారణి, ఇష్టసిద్ధులను కోనేఱులు మూఁడు గలవు. ఆకొలంకులలోఁ బుణ్యశరవణమను కోనేటం గ్రుంకినయెడల నింద్రునిచేఁ జేయఁబడిన యైంద్రవ్యాకరణము నెఱుఁగఁగలరు. భవకారణి యనుగుంటలో మునిఁగితిరేని యీపుట్టువునకుం గతమైన తొలిబాముచెయ్వుల నెఱుఁగఁగలరు. ఇష్టసిద్ధి యనుకొలనులోఁ గ్రుంకులిడితిరేని మీరు దలఁచినతలఁపుల నన్నియుఁ జేతి కబ్బఁగలరు.

అట్టిగుబ్బలిబొఱియలోఁ దూఱి మధురం జేరవలచితిరేని తిరుమాల్కున్ఱ మనునళగర్మలలోఁ బొడచూపుచుండు వెన్నునియడుగులఁ గన్నులారఁ జూచి, చేతులార దోయిలించి చెంగవాల్వెట్టి యుల్లమున మొల్ల మగుపేర్మితోఁ దలఁచి, నోరార నొడువులచేఁ బొగడి యాకొండను మున్నాఱు వలగొని చుట్టివచ్చి యచ్చటనుండు మిగులలోఁతు గలసిలం బేటిమొద్దున నిలిచిన యొక కొండగొంగునచ్చటు నడుగున 'వరోత్తమ' యనునందగత్తె యొకతె వచ్చి పొడ

కట్టును. అట్టు పొడచూపి మిమ్ములంజూచి 'యీ బావిమున కింపును, మఱుపుట్టువున కెప్పుడుం జెడలేని యిసులు నేవి? చెప్పుఁ' డని యడుగును. ఇట్లడిగినందుకు మీరు బదులు చెప్పినయెడల నాబావియుం దెఱచి మీకు దారిం జూపును. ఆదారిగుండాపోయి, దానంగల యెడదారులనెల్లం గడచి యేగితిరా, యొక జంటతలుపుఁగడప దోఁచును. అచ్చట నొక్కమచ్చెకంటి వచ్చి 'తుద లేని యిసులేది?' యని మిమ్ముల నడుగును. అందునకు మీరు బదులీయ కుండినను, మిమ్ముల నది యెంతేనియు వేఁకరింపదు. మీరు పోవలసినదారిని మిమ్ములం బోనిచ్చును. బదులిచ్చువారి కామ్యాదులగోలంకులం జూపును. పంచాక్షరి లేక యష్టాక్షరీమహామంత్రములలో నొక్కటిం దలంచుచు నా మూటిలో నొకకోనేటం గ్రుంకులిడిన మీకు మీతలంపు లఱచేతియుసిరికవలెఁ జేకుఱును. అట్లా గుంటలలో మునుఁగుట కిచ్చలేనియెడల నందుండినట్లే గునుసుఁ గైమువజోదుం గుఱిగొని యెదలోఁ దలఁచి కొలిచితిరేని యశగరు కోవెల గరుడకంబము మీకుఁ బొడకట్టును. ఆకంబముదారిం బోయిన మధురాపురముం జేరఁగలరు. ఇప్పుడు నేఁజెప్పినత్రోవలు రెండుగాక మూఁడవత్రోవను గూడ నుడివెద నాలింపుఁడు. ముందు వాకొనంబడిన రెండు తెరువులనడుమ నుండునట్టిత్రోవ యెంతో మేలైనదియగును. ఈత్రోవలోఁ దోఁపులును, గోనలును బెక్కులు గలవు. అట్లయిన నీత్రోవం జనువారల దయ్యమొకటి వచ్చి వెంపరలాడును. ఆదయ్యము మిక్కిలి యణకువగా ముచ్చటించుచుఁ దెరువరులవెడ్డువెట్టి పయనమున కడ్డవాట్లు సేయును. ఏపాటిదోసఁగుం బొసఁగింపదు. ఆదయ్యమునుండి దుసికిల్లి వెడలితిరా వైశమ మధురాపురిం జేరవచ్చును. ఇప్పుడే చెప్పిన మూఁడుతెరువులలో మీకు సరిపడినబాటవెంబడి మీ రేగవచ్చును. ఏనును బోదడై విచ్చేసి రెండడుగులతోఁ ద్రిజగములం గొలిచిన వెన్నునిం గొలువనేగెద" నని చెప్పెను.

పాఱుఁడు వలికినపలుకుల వినినకొంతి యిట్లని వాకొనెను:—'బాపనయ్యా! మాభగవానుఁడు పచరించిన పరమాగమములలో నైంద్రవ్యాకరణముం దిలకించుచున్నాము. కాఁబట్టి పుణ్యశ్రవణమును గుంటలో మునుఁగవలసినయగత్యము లేదు. తొలిబాముఁ జేసినచెయ్వులనే యీబాములోఁ గుడుచుచున్నా మనుటను మేము చక్కఁగాఁ దెలిసికొనియున్నాము. కనుక భవకారణి యనుగొలనున గ్రుంకవలవదు. నిక్కమ్ము, చాపమి యనురేకు

నోముల వాలాయము వాసిగ నోమువారలకు వారలతలంపులు విరివిగఁ జేకుఱుఁగావున మే మిష్టసిద్ధి యనుగుంటం గ్రుంకవలసినది లేదు. మాకు సరిపోయిన తెరువుంబట్టి యేగుదుము. మీరును మీతలఁచినట్లు విన్న మన్నం గొలిచినవెన్నని యజ్ఞులం గొలిచి పెందెరువు నందుకొనుగాక," పాఱుఁడు దనత్రోవ దారిం దరలెను. కొంతిమొదలగు ముగ్గురు నచ్చోటు వదలి నడిచిపోయి యొకకొటికలో బడలిక దీర్చుకొనుటకై తడసియుండిరి.

దారిలో దయ్యము దటమటించుట :—మఱునటినాఁటి రేపకడ మనలక లేచి యామువ్వురుం బయనమయి మధురకుం బోవుబాటవెంబడి యేగుచుండుటలే, గోవలుఁ డెండతాఁకుచే దప్పి గొని దప్పిం దీర్చికొనుటకొఱకు దారిలోని కొలనుగట్టుఁ జేరెను. అప్పటి కాకానలో నుండు దయ్య మొక్కటి గోవలు నేఁచఁదలఁచి వసంతమాలవలెను వాలకముగా వచ్చి, గోవలుని యంజలో వ్రాలి తాను మాధవిచే బుత్తెంపఁ బడిన దని నొడివి యేకువం దోరఁగొనెను. అప్పుడు మూఁగాటి పాఱునిపలుకులు గోవలుని నెనరునకు వచ్చుటయు, నిది యాకోనవేలుపో? నిక్కువంపు మానిసిమడఁతియో? యని యాజాయించి నేటు నెఱుఁగుటకై యంతరిమంత్రముం జపించెను. అలమంత్రమున కాదయ్యము బెలుకురి నిక్కువము నుడివి కంచుమించాయెను. గోవలుఁ డాకొనేట డిగ్గి, నీరుద్రాగి దప్పిదీర్చికొని, తనప్రోమాలికి నొకతమ్మియాకులో నీరుగొని పోయెను. కన్నకి యానీరుంద్రావి తనదప్పిం దగ్గించుకొనెను. వెండియు నాముగ్గురు వేవెలుంగు నెండవేఁడిమి వెగ్గలముగా నుండుటెఱిఁగి, యిఁకఁ ద్రోవనడచుటకు వలనుపడ దని తలఁచి యాత్రోవచేరువ నుండిన ఆర్యకోష్ఠ మను కాళిగుడి నెయ్యి విడిసి వేసటఁదీర్చుకొనుచుండిరి.

దుర్గిపూజ :—ఎఱుకులు పలువు రాదుర్గగుడి కేగి యందునం బొడచూపియుండు దుర్గమ్మను బలుతేవల నగ్గించి కైవార మొనర్చిరి. అప్పు డెఱుకతయైన వేలుపుసానిమీఁద సుమాళిమువచ్చి యచటనుండిన బోయలం జూచి దుర్గమ్మవాఁకిం జెల్లింపవలసిన కానికలఁ జెల్లింపమిం జేసి బోయపల్లెలం గల గుడిసెలన్నియుఁ బాడటినవి యనియు, వారల దోఁపుడుసొమ్ములు గొఱవడినవి యనియు, వారలకావరములు గడచనియె ననియు, నికనైన నమ్మవారి నోలగించి యునుకు బలి యీవలయు ననియుఁ గట్టడసేసెను. తోడన, తడయక కోయ లాదుర్గమ్మకు నాడంబరముగా నీరాట, గైసేతలు

మొదలైనవానిచే నోలగించి, తాముసేసిన పూజల నియ్యకొనవలయునని యు వేడించి వేడిరి. పదపది వేఁకరులందఱు పలుతెగల వాయిదముల వాయించి ఱవిసీలాడి కైవార మొనర్చిరి.

వెండియు నాసోదెకత్తెయీఁద సుమాళము వచ్చి గోవలునిచెంగట నుండినకన్నకిం జూపించి పట్రలంగని 'యీకె మేలిమినైన యీలువుగల యిల్లాలు; కొంగు, కుడగు, దమిళము మున్నగు విలాతిమన్నీలచేతను, గాఁపుల చేతను వేల్పు డొందఁబడు' నని మందలించెను. ఈనుడువులఁ జెవిగొన్న కన్నకి పుచ్చడీకముచేఁ దలవాంచి తనపెనిమిటిచాటునం డాగి నిలిచెను. వెండియు, నాసుమాళము 'వేఁకరు లొనర్చిన వేల్పుకువలన నుగ్గి నైకోలు వడసిన'దని ముచ్చటించి మోలమూన గొనియెను. వీనినంతయుఁ జూచి కొంతి మున్నగు ముగ్గురు నగ్గలముగ నలరుచుండిరి.

చెంచుల యించుచెయ్యుల నంచలనుండి చూచుచుండి యన్నియుఁ గొనసాగిన పిమ్మట, గోవలుఁడు గొంతిం గని 'నాయనుఁగుటాలు వేఁడివెలుంగు నెండవేఁడిమి పోఁడిమిమిరాలు నీపగటిప్రొద్దున నెట్లు నడువఁగలదు? దానియ అకాళ్లంత బొబ్బలు పొటమరించెను; మోము గోముసెడి వసివాడెను; ఒడలు బడలి వాడువాతెను గనుక పగటిప్రొద్దు నిందుండి కడచి యీరేయ రేవెలుఁగు పొడతెంచినయంతనె యిచ్చోటువిడిచి రేయెండలో మనదారిం బట్టి యేఁగ వచ్చు' నని చెప్పెను. అందునకుం గొంతియు నెయ్యముతో నియ్యకొనెను.

నాఁటిరేయిఁ దొగలవిందు పొడతెంచినపిదప నాముువ్వురు నందుండిన దుగ్గిగుడి విడిచి వెడలి మధురాపురికిం బోవుబాటం బట్టి పోవుచుండిరి. త్రోవలోఁ గొంతి గోవలునికిఁ బలువగల నిగారవు టపాటముల ముచ్చటించుచఁ జనుచుండిరి. అట్టియింపుకతలం జానుగుచవిగా వినుచు గోవలుఁడును గన్నకియుఁ దమనడుచుటవలని యలపులను నొప్పులనుం జీఁకిసేయక నడచియేఁగిరి. మఱునటినాఁటివేకువ నాముువ్వురు బొమ్మంత్రు వెలయు నొకకొట్టికం దగ్గఱిరి. అప్పుడు గోవలుఁడు గొంతినిం గన్నకిని నొక్కెడ నుండనిచ్చి తాను వేఁడివెంటలఁ దీర్చివచ్చుటకై చెఁతనుండు నొకబావియొద్దికి నేగెను.

మాధవిచేఁ బంపబడిన కౌశికుఁడు గోవలునిం జూచుట:—గోవలుని యెడఁబాటువంతల నొపక యందురి మలఁగుచుండిన మాధవిచేఁ గావిరి పూంబట్టణమునుండి పనుపంబడినకౌశికుఁ డనుపాఱుఁ డొకఁడు మాధవివుత్తెంచిన కిల్లాకు తోనాబావియొద్దకి నేతెంచెను. అట్లు దోతెంచితాఁ దె

చ్చినకిల్లాకు వా గోవలునిచేతి కిచ్చెను. గోవలుఁ డాకమ్మం జదివి, ముప్పి నడసిన తనతలిదండ్రులను, మాధవియుఁ గుడుచుచుండు గొడవలనెఱిఁగి తద్దయుఁ గోడాడెను. పుహార్ పట్టణముం బాసి పఱతెంచిన కతంబును, దనకై వారములను దనతల్లిదండ్రులకుం జెప్పి వారలం జక్కగఁ బ్రోదిసేయుచుండున ట్లును నొడివి గోవలుఁ డాబాఁపనయ్యం బంపెను. పిదప గోవలుఁడు దనవేగు వెంటలం దీర్చికొని కన్నకియుఁ గౌంతియు నుండుతావున కేతెంచెను.

గోవలుఁడుమున్నగు మువ్వురును మధురాపురిం జేరుట :—అందుండి యామువ్వురును మధురకుం బోవుదారింబట్టి కొంతద వ్వేగుటయు, గాణలు గొందఱు వారలయొద్దికి వచ్చిచేరిరి. ఆగాణలు గొన్నిపాటలం బాడఁగా నా పాటలకుం దగినట్లైవడి గోవలుఁడు వీణియ వాయించెను. వెండియుఁ ద్రోవన డుచుచు గోవలుఁ డాగాణలం దిలకించి 'యిందుండి మధురానగర మెంతద వ్వుండు'నని యడుగఁగా, 'నదిగో! చూడుఁడు పొగ మొగయుచున్నది గదా! ఆపొగ మధురానగరమునుండియే మొగయుచున్నది,' యని చెప్పి వారలం బాసి యాగాణలు దమదారిం దరలిరి. నాఁటిపగటిప్రొద్దుం గడపుట కాకాంతి మున్నగుమువురు నచ్చటనే యొకతోఁపులో నలపు తీర్చుకొనుచుండి రేయ గుటయు నచటు వదలి బయలుదేఱి పోయి వైగయేటిం డగ్గఱి దానింగొలిచి యోడ యెక్కి యవ్వలిగట్టుం జేరి, యందుండి పోయి మధురానగరముయొక్క కోటగోడ దండనుండిన నిరాబారుల యిరవైన వెలినగరిలో విడిసియుండిరి.

మఱునాఁటి రేపట లేచి గోవలుఁడు గౌంతిం గొలిచి, తనకు ముందటం బొడమిన యిడుమల నెల్ల నొడివి యడలుచుండెను. కౌంతివారల నూఱడిం పుమాటలం బెక్కులు సెప్పి యోదార్చెను. పిదప, కన్నకిం గౌంతికి నప్ప గించి 'మధురనగరిలోనికిం బోయి బేరమొనర్పుటకుం దగిన చోటు నారసి వచ్చెద' నని వెలువడి మధురానగరిలోనికిం బోయెను. అప్పుడు, మధురా పురి నేలుచుండిన నేత పాండ్యవంగడములోఁ బొడచూపిన 'నెడుంజెళియఁ'డను నిడుదపాండ్యుఁడు. అతని 'దేవి కోప్పెరుందేవి' యను రాజమహాదేవియగును.

మధురానగరిలోనికి నేగిన గోవలుఁడు, బాఁపనలు, రాచవారలు, బచ్చులు, వెలమ లనునీవంశసంతతులవా రిరవారు తెరువులంతటికి నేగి, దాని మేలిమిని, యంగడివీథులయందములను, దేవళముల యావటమును, రచ్చ కొట్టముల మెచ్చులును, మన్నిమిగపాడియుఁ గని మదిం గనుకని నెనసి నివ్వెఱపడెను. (సశేషము).

వివిధవిషయములు

అమెరికాదేశమునందు మాక్డొగల్ అను నొకశాస్త్రవేత్త వృక్షముల తమవృద్ధిక్షయములను దామే తెలుపునటు లొకనూతనయంత్రమును వినిర్మించియున్నాఁడు. దానికి డెండ్రోగ్రాఫు (Dendrograph) అని పేరు. ఆసాధనము నెట్టివృక్షమునకైనను దగిల్చినయెడల నది శీతోష్ణస్థితుల భేదమువలన గాని మఱియితరకారణములవలనఁ గాని పొందువృద్ధిక్షయములను సులభముగఁ దెలిసికొన నగును. చిరకాలము జీవించినవృక్షముల వృద్ధి గాని క్షయముగాని సూక్ష్మతరం బగుటచే నిట్టిసాధన మావశ్యకమని చెప్పనగును. నూతనముఁగ గనిపెట్టఁబడినయంత్రము శీతోష్ణములవలన నెట్టిమార్పును బొందఁజాలదు. ఏవృక్షమైనను దనసాంవత్సరిక వృద్ధిక్షయములనే గాక ప్రతిదినమును వృద్ధిక్షయములను బొందు ననియు, నట్టివృద్ధి గాని తగ్గుదల గాని దానివ్యాసపరిమాణమునందు $\frac{1}{1250}$ భాగము మొదలు $\frac{1}{250}$ భాగమువఱకుండు ననియు నాతఁడు నిర్ధారణ మొనర్చియున్నాఁడు.

ప్రాచీనవస్తుపరిశోధకసంఘమువా (Archaeologists) రిటీవల సింధుదేశమునందలి మోహెంజోడారోయను నొకపురాతనపట్టణమును బరిశీలింపనం దాభరణములపాత్ర మొకటి కాన్పించినది. దానికిఁ జుట్టిన నేతవస్త్రము చినిఁగిపోయినను, ఆవస్త్రఖండములను జూడ హిందూదేశమున నయిదువేల సంవత్సరములక్రితము ప్రత్తిచే నేయఁబడిన వస్త్రములు వాడఁబడుచుండె నని పరిశోధకసంఘమువారు నిశ్చయించిరి. గ్రీకు, బాబిలోనియనుభాషలయందు అట్టివస్త్రములకు సిందన్ను, సిందు అని పేరుండుటచే నవి సింధుదేశమునందు నేయఁబడుచుండె ననియు నవిపట్టుసంబంధ మనియుఁ, బ్రత్తితో నేయఁబడినవి కావనియు నిదివఱలో ననేకులు నమ్ముచుండిరి. సింధుదేశమునందలి పరిశోధనమువలన మనచేఁ బ్రత్తియని పిలువఁబడుదానితో వస్త్రములను గ్రీ.పూ 3000 సంవత్సరములక్రితము నేయుచుండెడివా రని నిశ్చయమగుచున్నది.

సింధునది కుపనది యగుసట్లెజ్ నదీజలములచేఁ దవరాజ్యమునందు విరివిగ సేద్య మొనర్చుటకై బికనీరుమహారాజుగారు చేసినప్రయత్నము నేఁడు

ఫలించినది. సట్లెజ్‌నదినుండి యుత్పాదితమైన కాలువయొకటి బికనీరురాజ్యములోనికి ద్రవ్వఁబడినది. ఆకాలువకు నిరుపైపుల నెనుబదిమైళ్లదూరమువఱకును జల మింకకుండునటులు సున్నపుపని గావింపఁబడినది. ఆకాలువవలన సుమారు, ఆఱులక్షలయకరములు సాగుచేయవచ్చునట. అందువలనఁ బదునాలుగువత్సరములలో విశేషమురాబడి వచ్చునని నమ్ముచున్నారు.

హిమాలయపర్వతపంక్తులలో నెవరెస్టుశిఖర మెత్తయినది. దానిని టిబెటుదేశీయులు లోకమాత యందురు. దానియున్నతశిఖరమును జేరఁబోయి తిరిగి జీవములతో నరుదెంచుట కష్టసాధ్య మని వారు తలఁతురు. ఇటీవల, పాశ్చాత్యులలోఁ గొంద ఱాశిఖరప్రాంతమునఁ బదునెనిమిదివేలయడుగులవఱకును బోయి పరిశోధించినటులు వినియున్నాము. నూతనముగ కెప్టెనునోలు అనునతఁడు తనకెమేరాను గైకొని హిమాలయపర్వతశిఖరముల పైకిఁ బోవుటయేగాక యచట సినిమాప్రదర్శనమునకుఁ దగిన ఫోటోలను దీసి పాశ్చాత్యదేశములను రంజింపఁజేయుచున్నటులు దెలియుచున్నది. ఆప్రదర్శనము వలన మానవుని యల్పతయుఁ, బ్రకృతివైభవసౌందర్యములును బ్రేక్షకులదృష్టికిఁ దోఁపఁజేయుటయే తనయాశయ మని నోలుగారు వ్రాసియున్నారు.

డార్వినుపండితుఁడు తనగ్రంథమును రచియించిననాఁటినుండియు, నితరశాస్త్రపరిశోధకులు మానవుఁడు తనప్రస్తుతమానవస్వరూపమును బొందకపూర్వ మెట్టిస్వరూపమును ధరించెనో యని వివిధపరిశోధనల జరుపుచున్నారు డార్విను చూపినమార్గము ననుసరించి గ్రెగరీ యనుశాస్త్రవేత్త మానవులకును గోఁతులకును బరస్పరసాదృశ్యము గల దనియు, మానవులు కొన్నివేల సంవత్సరముల క్రిందట నుండిన యొకకోఁతిజాతి నుండి పరిణామసూత్రముచే బ్రస్తుతస్థితిని బొంది రని సిద్ధాంతీకరించెను. ఆస్బరను (Professor Henry Fairfield Osborn of Newyork) అనుపండితుఁడు డార్వినుగ్రెగరీల సిద్ధాంతములు సరికావనియు మానవులును గోఁతులునుగూడ 160 లక్షలసంవత్సరములక్రితము పుట్టియుండి రనియు, నందువలన మర్కటజాతినుండి మానవు లుద్భవించు టసంభవ మనియు, మధ్యాశియాపర్వతభూములయందు మానవజాతి మొదట జనించె ననియు వ్రాసియున్నాఁడు. నూతనముగ నెబ్రాస్కాపర్వతప్రాం

తమునఁ గనిపెట్టఁబడిన యెముకపనిముట్లాకాలమునాఁటి వని యాతనియభిప్రాయము. ఆకాలమునాఁటిమానవులను మొదటిమనుష్యులని (Dawn men) యాతఁడుపేర్కొనియున్నాఁడు. వా రేమృగజాతినుండి యుద్భవించిరో యింకను దెలియలేదఁట.

ఫ్రాన్సుదేశమున నత్యద్భుత మగుకాలువ యొకటి త్రవ్వఁబడినదని తెలియవచ్చుచున్నది. రేవుపట్టణ మగుమార్సెల్సు (Marseilles) నుండి పదునైదుమైళ్లదూరమున నున్నబెరేసరస్సువఱకు నది వ్యాపించియున్నది. మార్గమధ్యమునఁ బర్వతపంక్తు లడ్డువచ్చుటచే డెబ్బదిరెం డడుగులవెడల్పు గలిగి నైదుమైళ్లు పొడుగు గల సొరంగము నొక దానిని బర్వతముల భేదించి త్రవ్వియున్నారు. దానిని ద్రవ్వుటకు సుమారు ఆఱుకోట్లడాలర్లు వ్యయమైనవఁట. ప్రపంచమునఁ జూచియానందింపఁదగిన దృశ్యములలో నిదియొకటి యని చెప్పవచ్చును.

జావాద్వీపమునకుఁ దూర్పున నున్నబాలీ యనుద్వీపమున కేగి యచటి నాగరకతావిశేషముల వరసి తాము గనినవింతలను దమ యనుభవములను మాడెరను రివ్యూ యను పత్రికయందుఁ గాళిదాసునాగ్ గారు వ్రాసియున్నారు. మహాభారతమును, బ్రహ్మాండవిష్ణుపురాణములను, మనఃభృగుధర్మశాస్త్రములను గామందక రాజనీతిశాస్త్రమును జిలంటిక్ అను పండితునియొద్దఁ దాము కనుఁగొంటి మనియు, నవి యచటిభాషలో నున్న వనియు వీరు దెలిపియున్నారు. అచటిదేవాలయములు మనదేవాలయముల వలె నుండును గాని చెక్కడపుఁబనుల విశేషముగ గలిగియుండునఁట. గరుడుని మూఁపుననుండు విష్ణుమూర్తివిగ్రహముగూడ నొకదేవాలయపుగోడపైఁ జెక్కఁబడినటులు దెలియుచున్నది. అచటినాగరకతయుఁ, బంచాయితీసంఘములును, మతవిషయములును హిందూదేశమునందలి పురాతనవిషయముల స్ఫురింపఁజేయుచున్నవి. మాడరనురివ్యూ పత్రికయందలి దేవాలయమునకుఁ బోవుబాలీదేశపుస్త్రీల చిత్తరువును జూచి వారు స్తనాచ్ఛాదనకునై బిగించిన వస్త్రములు 'అతిపినద్ధేనవల్కలేన ప్రియంవదయా నియంత్రితాస్మి' యను శాకుంతలమునందలి వల్కలవర్ణనమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది.

జపానుదేశపు నేతపరిశ్రమలు సుమారు 1867 వసంవత్సరమున మొదలుపెట్టఁబడి యిరువదివత్సరములలో మిక్కిలి యభివృద్ధిఁ జెందినవి. 55 లక్షలరాట్నములును 80,000 మగ్గములును బనిచేయుచున్నవి. ప్రతిసంవత్సరమును 28 లక్షలబేళ్లప్రత్తి యచటికి దిగుమతి చేయఁబడుచున్నది. సుమారు 500 మిలియనుయెన్నుల సరకు లచటినుండి యెగుమతి యగుచున్నవి. (ఎన్ను రు 1-4-0 విలువగల జపాను నాణెము) అమెరికాఖండమునఁ దక్క మఱియెచటను బ్రత్తి పరిశ్రమ యంతయభివృద్ధిని జెందలేదని ప్రస్తుతజపానుదేశము (Present day Japan) అనుపత్రికయందు వ్రాయఁబడియున్నది. జపానుదేశపు ఆర్థికస్థితి కీపరిశ్రమయొక్క వృద్ధిక్షయములే కారణ మనుట యతిశయోక్తి కాదు.

కొమడో యను ద్వీపమున నూసరవెల్లి (Lizard) జాతికిఁ జెందినగొప్పజంతువులఁ జూచితిమనియు, నవి పదిమొదలిరువదియడుగులవఱకుఁ బొడుగుగ నుండెననియు, కాబ్ హేముగారు వ్రాయుచున్నారు. అవి యడవిపందులను, పోనీజాతిగుఱ్ఱముల నవలీలగఁ జంపి తమగోళ్లతోఁ జీల్చితినునఁట. తోఁకతోఁ గొట్టినయెడల నెట్టిమనుజుఁడైనను విగతజీవుఁడగుటకు సందియము లేదు. ఆజాతి రమారమి నాలుగువేలసంవత్సరములనుండియు భూమియందుఁ బ్రబలియున్న దని శాస్త్రవేత్తలు చెప్పుచున్నారు.

అమెరికాయందు గృహములు నానాఁటికిని నాకసము నంటునటులు నిర్మింపఁబడుచున్నవి. న్యూయార్కుపట్టణమధ్యమున నూటపదియంతస్తులను గలిగి 1208 యడుగుల యెత్తుగలసౌధము నిర్మింపఁబడుచున్న దని తెలియుచున్నది. అది కట్టుటకు ఇంచుమించు 13 మిలియనులడాలర్లు వ్యయ మగునఁట. అందు నలువది వేలమనుష్యులు నివసింపవచ్చును. 60 అంతస్తులు గలిగిన వూలువర్తు సౌధముకంటె నిది మూఁడురెట్లు ఎత్తుగ నుండును. ఇట్టికట్టడములవలన నపాయము లెక్కువగ నుండుననియు, నిప్పుడైనను గనులు దెఱచి అమెరికాదేశస్థులు వాని నిర్మాణమును మానవలయు ననియు, థామస్ యెడిసనుగారు తెలుపుచున్నారు.

కాళీఘట్టమునకు సమీపమున రూపనారాయణనదీతీరమున దామ్రలిప్తి యనునగరముండెడిది. దానిని ప్రస్తుతము టమ్లుక్ అనిపిలుచుచున్నారు. ఆపట్టణప్రాంతమున రోమనుచక్రవర్తియగు జస్టినియనుయొక్క నాణెములు పరిశోధకులకు దొరకినవి. టోలమీ, ఫాహియను, హ్యూనుసాంగు మొదలగు చరిత్రకారు లీపట్టణమును గూర్చి వ్రాసియున్నారు. అది పూర్వకాలమున రేవుపట్టణ మనియు నపుడు సముద్ర మచటికి దాదాపుగా నెనిమిదిమైళ్ల దూరమునుండె ననియుఁ దెలియుచున్నది. ఇపుడు సముద్ర మచటి కఱువదిమైళ్ళ దూరమున నున్నది. ఆపట్టణమునుండియే సింహళము, చీనా మొదలగు దేశములకు వాణిజ్యము జరుగుచుండెను. నీలిమందు, పట్టువస్త్రములు, తామ్రము విశేషముగ నెగుమతిచేయుచుండెడివారు. తామ్ర మెగుమతి యగుచుండుటచేతనే తామ్రలిప్తి యనుపేరు వచ్చియుండు నని చీనాయాత్రికుఁడు హ్యూనుసాంగు వ్రాసియున్నాఁడు. అచట బౌద్ధవిహారములు పదియుండె ననియు, 200 అడుగుల యెత్తుగల యశోకునిస్తంభ మొకటి యుండెననియు నాతనిగ్రంథమువలననే తెలియుచున్నది.

హిందూదేశమున గుహాప్రదేశములు పెక్కులు గలవు. అవి బొంబాయిరాజధానిలో నెక్కువగ నున్నవి. కార్ల, అజంతా గుహలు పాఠకులకుఁ జిరపరిచితములే. పూర్వమాగుహలు బౌద్ధవిహారములుగ నుండుటకైనిర్మింపఁబడుచుండెడివి. ఆగుహలయందు శిల్పము విశేషముగ లేకపోయినను జూపఱకానంద మొసఁగు చిత్రలేఖన ముండును. ఆకాలమునాఁటి రంగు లింకను వన్నెఁబాయక హృద్యముగ నున్నవి. బౌద్ధుల మహాయానపథముఁ దెలుపు చిత్రము లజంతాగుహలయం దెన్నియో గలవు. పుదుకోటసమీపమున సిత్తనవాసల్ గుహయం దతిరమ్యము లగుచిత్రములు గలవు.

శాలివాహనశక ప్రారంభమును గూర్చి బెంగుళూరు మిథిక్ జర్నలు (Journal of the mythic Society Vol.XVIII Part I) జూలై సంచిక యందుఁ జర్చింపఁబడినది. కన్హింగుహామును డూబ్రెయిలు నుక్షహరాటా చస్తనుఁడు శాలివాహనశకప్రారంభ మొనర్చె ననియు, పండితభగవాన్లాలును

క్లీటుద్వారయు క్షహరాటా నహాపనుని కాలమే శకప్రారంభ మనియు వ్రాసియున్నారు.

పైపత్త్రికయందు భక్లెగారు చష్టనుఁడుగాని నహాపనుఁడుగాని శాలివాహనశకమును బ్రారంభింప లేదనియు, నహాపనుఁడు క్రీస్తుపూర్వము మొదటి శతాబ్దమువాఁడనియు, గౌతమిపుత్త్ర శాతకర్ణి శాతవాహనుఁడు క్రీ. శ 124 తరువాతివాఁడు గాఁడనియు, నతనిరాజ్యకాలము క్రీ. శ 70–80 సంవత్సరములలోఁ బ్రారంభించిన దనియు వ్రాసియున్నారు. గౌతమిపుత్త్ర శాతకర్ణియే శాలివాహనశకప్రారంభ మొనర్చె నని వీరిమతము. పండిత శ్రీకంఠశాస్త్రిగారి హాలునికాలమునే శకప్రారంభ మయ్యెనను వాదమును ఖండించుటకై యీ వ్యాసము వ్రాయఁబడినది. గౌతమిపుత్త్ర శాతకర్ణి క్రీ. శ. 133–154 వఱకు రాజ్యమొనర్చె నని చరిత్త్రకారులు వ్రాసియున్నారు. చిలుకూరి వీరభద్రరావుగారి యాంధ్రులచరిత్రమును నైమార్గమునే యనుసరించుచున్నది. గౌతమీపుత్త్రునికాలము సరియయినచో హాలుఁడే శాలివాహనశకప్రారంభ మొనర్చె నన వలసివచ్చును. గౌతమీపుత్త్రునికాలమున శకప్రారంభ మయ్యెనను వాదము విమర్శనీయము ఈసందర్భమున నాంధ్రచారిత్త్రకపరిశోధకసంఘమువారి పత్త్రిక రెండవసంపుటము ప్రథమసంచికయందు (Journal of the Andhra Historical Research Society Vol II Part I) వెలువడిన శాలివాహనశకమను వ్యాసమును జూడనగును.

అనంగహర్షవిరచిత మగుతాపసవత్సరాజ మనుసంస్కృతనాటకమునకు జర్మనీదేశమునుండి ఫొటోప్రతినిసంపాదించితి మనియు, నది యాఱవశతాబ్దప్రాంతమున రచింపఁబడియుండెననియు మానవల్లిరామకృష్ణకవిగారు ఆంధ్రపరిశోధకమండలివారిచేఁ బ్రకటింపఁబడినపత్త్రికయందుఁ దెల్పియున్నారు. రత్నావళీస్వప్నవాసవదత్తాదినాటకములవలెనే యిందలియితివృత్తము ఉదయనుఁడను వత్సరాజును ద్దేశించియున్నది. స్వప్నవాసవదత్తమందువలెఁ బద్మావతీకరపరిగ్రహణమువర్ణింపఁబడినదఁట. శైలి రమణీయముగ నున్నదనియు, గొన్నివిధముల భాసునిస్వప్నవాసవదత్తనాటకమును మించియున్నదనియు వారు వ్రాసియున్నారు. శైలికై యొకశ్లోకము–

సంక్షుద్ధస్య లలాటలోచనభువా సప్తార్చిషా ధూర్జటే
నిర్దగ్ధే మకరధ్వజే రతిరసా కిం స్యాద్గృహీతవ్రతా
సంవాసాద్వనదేవతామునివధూవేషప్రపంచే గతః
కుత్రైతం రమతే త్రివిగ్రహవతీ కింవా పతశ్రీరియమ్

కవిగారు శీఘ్రముగ సీనాటకమును బ్రచురించి పాఠకలోకమున కానందముఁగూర్తురుగాక.

సంభాషి ప్రథమసంచికయందు చిలుకూరి వీరభద్రరావుగారు కొన్ని వింతచరిత్రాంశములను దెల్పియున్నారు. శివయోగసారగ్రంథకర్త యగు కొలని ఆదిమూలనామాత్యపుత్రుఁ డగుగణపతిదేవమహాకవికిఁ బూర్వుఁడగు అన్నయదేవభూపాలుఁడు నియోగిబ్రాహ్మణుఁ డయ్యును కాకతీయవంశజ యగు రుద్రమదేవి కల్లుఁ డయ్యెనని యు, నన్నయదేవులు బెక్కు రుండినను రుద్రమదేవియల్లుఁడగు అన్నయదేవుఁడే శివయోగసారగ్రంథకర్తకుఁ బూర్వుఁడనియు వారు చర్చించి నిరూపించియున్నారు. అన్నయదేవునివంశమున కిమలూరివంశ మని ప్రథమమునఁ బేరున్నను, కొలనివీడు (యేలూరు) ను వశపఱుచుకొనుటచేఁ గొలనివా రనునింటిపేరు గలిగినదని తెల్పఁబడినది.

చిరకాలమునుండియు హిందూదేశమున గోవులు భక్తిశ్రద్ధలతోఁ బూజింపఁబడుచు రక్షింపఁబడుచుండెడివి. పురాణగాథలయం దెట్లు తెల్పఁబడియున్నను, ఆర్యులజీవితము గోవులపై నితరపశువులపై నాధారపడి యుండుటయే దీనికిఁ గారణ మని చరిత్రకారులు వ్రాయుచున్నారు. బౌద్ధజైనమతము లభివృద్ధిఁ జెందినకాలమున, నెట్టియల్పజంతువునైనను హింసింపఁగూడ దని నియమ మేర్పడినది. బౌద్ధమతావలంబు లగు అశోకుఁడు మొదలగు చక్రవర్తులకాలమందు రాజుల పాకశాలలయందు సైతము జంతుహింస నిషేధింపఁబడి యుండె నని తెలియుచున్నది. జంతుచికిత్సకు నై వైద్యశాల లేర్పఱుపఁబడినవి. ఆనాఁటియాచారము లింకను బూర్తిగ నడుగంటియుండలేదు. ఆర్యధర్మముల ననుసరించి రాజశాసనము లొనర్పఁబడియుండుటచేఁ బూర్వపు చక్రవర్తులకాలమున గోరక్షణ మొనర్పఁబడుచుండెను. ఆఱవశతాబ్దమందుండిన కాశ్మీరనృపతి యగుగోపాదిత్యునికాలమున యజ్ఞములందుఁ దప్ప జంతుహింస యొనర్పఁగూడ దనునియమముండె నని రాజతరంగిణియందుఁ దెల్పఁబడియున్నది. మేఘవాహనునికాలమున ఘృతముతోఁ జేసినపశురూపమును మాత్రము యజ్ఞముల నుపయోగించిరఁట. వేయేల. తొమ్మిదవ శతాబ్దమందలి యవంతివర్మకాలమున వితస్తీనదీతీరమునఁ బక్షులను జేపలను సైతము జంపరా దని శాసనముండెను. గూర్జరదేశమునఁ బండ్రెండవశతాబ్దమందుండిన కుమారపాలునిరాజ్యమున నెట్టిచిన్నజంతువును హింసించినను విశేష మగుదండనము విధింపఁబడెను. గోరక్షణమును గుఱించి యింకను బెక్కువిశేషాంశములు జెంగునేరు విలియమ్ జన్నలు జూలైసంచికయందుఁ జూడనగును.

ఆంధ్ర భారతి.

(కవిభూషణ కవిరాజ శ్రీవత్సవాయ వేంకటనీలాద్రిరాజుగారు)

సీ. కల్హారములపొందు గాదుపొమ్మని సరోజములఁ గైకొనుపదక్రమము పొలుగు
చిన్నిపూఁదేనెమచ్చికఁ బాటి సేయక చెఱకుపాల్మెచ్చు వాతెఱబెడంగు
నవశిరీషప్రసూనముల నుల్లసమాడి మిసిమిపొత్తున మన్న మేనిమెలపు
మందారకుసుమదామము నాదరింపక శశిరేఖఁ గొను కచోచ్చయముఖాల
యాలు
సహజమై యొప్ప నీయుపాసనమువలన, శ్రీమహామండలేశ లక్ష్మీవిభూతి
సురభిళము సేయు బిడ్డలశోభఁ గంటి, యాంధ్రభారతి నీభాగ్యమనదె పొగడ.

శా. అమ్మా భారతి యేమి నన్నదయ యొక్కా వంత నామీఁదరా
నిమ్మా ప్రస్తుతి మేమి వర్ణ్య మఖిలాంధ్రేశానసామ్రాజ్యమా
సమ్మోదం బిదె కొమ్ము సాంధ్యనటనాసంరంభ శంభుక్షిప
ద్ధమ్మిల్లోద్యతరంగిణీకలకలోదంచద్వచో గుంభనల్.

ఉ. నీచనుదోయి నవ్యకమనీయవిశేషపయఃప్రపూరముల్
నాచనసోమవాఙ్మయసనాథులు గ్రోలనె యింకె నంచు నా
లోచనయయ్యెడుం జనని లోఁగక యించుకలెక్క నేసియుం
వాచవిచూపవమ్మ శిశువత్సల వేఁడుగదమ్మ భారతీ!

ఉ. కొంకక కింకవీంద్రులను కుంకుమప్రాఁకుల సంస్కృతాంధ్రకా
లంకవసాహితీలసవలక్త విశాలహరీరయంబునన్
గుంకటివేళ్లతోఁ జెటికి కొంచును సక్కవిగోస్తనీకద
శ్యంకితనారికేళవని శారడి వెట్టకుమమ్మ భారతీ.

ఉ. స్రాలకపత్మముల్ బయలువారక చూపులు కేవలోన్నమ
ద్వ్రాలతమీఁద నానుకొని పోవఁగ నాత్మశరీరభాన ని
ద్మాలముగాఁగ నీలలితరూపకశైక్యము గాంచుమాకు నే
పోలిక నాత్మకెక్కుఁ గవిభూషణశబ్దము కావ్యభారతి.
